ఇందిర
దంతవైద్యశాల
సెంటర్‌మార్కెట్ దగ్గర, పొగతోట,
నెల్లూరు. సెల్: 99083 22007



Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)
స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930
*Longest Living Newspaper in Telugu Journalism*

# జమీన్ రైతు

సంపుటి: 81 • సంచిక: 3 • 15-1-2010 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



లేజర్ చికిత్స
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300


● వైఎస్ ఆత్మను క్షోభ పెట్టడమేనా

## జగన్ వారసత్వం తీరు?

రిలయన్స్ ఆస్తుల మీద దాడి వైఎస్ జగన్ చేసిన నేరమన్న నిశ్చితాభిప్రాయానికి వచ్చేసింది కాంగ్రెస్ అధిష్టానం. అందులో ఆయన పాత్ర, ప్రమేయం ఎంతో ఆ భగవంతుడికే తెలియాలి. కానీ నింద మాత్రం పడింది. చెరుపలేని మచ్చ ఏర్పడింది. దాని దుష్ఫలితం సాక్షి పత్రికాఫీసులో పోలీసుల సోదా. సాక్షి అంటే వైఎస్.రాజశేఖరరెడ్డి స్వంత సంస్థ. ఆయన బ్రతికి వుంటే, దానిలోకి వెళ్లి సోదా చేయడం సంగతి దేముడెరుగు, ఆ వీధిన వెళ్తూ దానివైపు తలెత్తి చూడడానికి కూడా ఏ పోలీసు అధికారికీ దమ్ము, ధైర్యం వుండేవి కావు. ఆయన మరణించి నాలుగు నెలలు నిండక ముందే ఆ ప్రతిష్ట మంటగలిసిపోయింది. ఆ పట్టు సడలిపోయింది. రిలయన్స్ మీద దాడులతో జగన్‌కు ప్రమేయం లేకపోవచ్చు. ఆయనకే మాత్రం సంబంధం లేకుండానే జరిగి వుండవచ్చు. కానీ సాక్షి పత్రికకు జరిగిన అవమానం మాత్రం పూర్తిగా ఆయన స్వయంకృతాపరాధమే. అందులో సందేహం లేదు.

వైఎస్ మరణం వెనుక ఏదో మర్మం దాగి వుందన్న అనుమానం జగన్‌కు మొదటి నుంచి వుంది. అది నిజంగా మనసులోని అనుమానపు బీజమో లేక తన రాజకీయ ఎత్తుగడలో భాగమో తెలియదు. ఈ నాలుగు నెలల్లో ఒకటికి పదిసార్లు ఆ కోణంలో సాక్షి పత్రిక వార్తలు, వ్యాసాలు ప్రచురించింది. ఎన్నో ప్రశ్నలు సంధించింది. కానీ వాటిని జనం పట్టించుకోలేదు. స్పందన చూపలేదు. ఆ ప్రమాదం జరిగిన తీరుపై పత్రికలలో, టివిలలో వచ్చిన సవిస్తారమైన వార్తాకథనాలు, చర్చలు, ప్రత్యక్ష దృశ్యాలు ప్రజలను సమాధానపరచాయి. ప్రమాదం కంటే వేరే కారణం వుంటుందన్న అనుమానానికి ఆస్కారం లేకుండా చేశాయి. వైఎస్ వంటి ధీరోధాత్తుడిని చంపాలని కుట్ర చేసే ధైర్యం ఎవరికి వుంటుంది? పటిష్టమైన బందోబస్తును దాటుకొని ఆ అవకాశం ఎట్లా వస్తుంది?

రష్యాకు చెందిన ఎగ్జయిల్డ్ వెబ్‌సైట్‌లో ఈ అనుమానాన్ని వ్యక్తం చేసినా, అది వూహాత్మకం, కల్పితం, కట్టుకథ అని స్పష్టంగా పేర్కొని మరీ వ్రాశారు. ఎటిసిడిల స్థాయి ఇంగ్లీష్ తెలిసినవాడికి కూడా దాన్ని చదివితే ఆ సంగతి అర్థమౌతుంది. ఆ కట్టుకథను సమాజంలో కల్మషం నింపే స్థాయిలో వార్తాకథనంగా మల్చడం జగన్




వంటివారు చేయదగిన పని కాదు. ఆయన వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుమారుడు. పార్లమెంట్ సభ్యుడు. పత్రికాధిపతి. ఒకటికి మూడు టీవీ ఛానళ్ల యజమాని. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్నవాడు. అందుకోసం రాష్ట్రం మొత్తం మీద వేల సంఖ్యలో అనుచర గణాన్ని పెంచి పోషిస్తున్నవాడు. మంత్రులను

కొరవ 14వ పేజీలో

ఫత్వాలివ్వడానికి

## ఆమేమైనా ముల్లానా!

టిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ కుమార్తె కవిత తీరు ఏహ్యభావం కల్గిస్తున్నది. జూనియర్ ఎన్టీఆర్ కొత్త సినిమా అదుర్స్‌ను అడ్డుకోండని తెలంగాణ ప్రజలకు ఆమె పిలుపునివ్వడం అసహ్యం కల్గించింది. ఫలానా సినిమా చూడండని, ఫలానాది వద్దని చెప్పడానికి ఆమేమైనా ముల్లానా? ఇమామా? ఆమెకు ఆ అధికారం ఎవరిచ్చారు? ఆ పిలుపుల వెనుక వున్న మర్మం ఏమిటి? అదుర్స్ సినిమాను అడ్డుకోవడానికి, తెలంగాణ ఉద్యమానికి సంబంధం ఏమిటి? ఆ సినిమా చూడకుంటే తెలంగాణ వచ్చేస్తుందా? చూస్తే రాదా? సినీ పరిశ్రమను బెదరించి, భయపెట్టి డబ్బు దండుకోవడానికి వేసిన ఎత్తు తప్ప ఈ ప్రయత్నంలో మరొక ఉద్దేశం కన్పించడం లేదు. తెలంగాణ ఉద్యమ నిర్మాతగా కెసిఆర్‌కు ఎంతో కొంత గౌరవం వుంది. స్థాయి ఏర్పడింది. తన కడుపున పుట్టిన బిడ్డలు ఇటువంటి చిల్లరమల్లర చేష్టలతో ఉద్యమాన్నే పలచన చేస్తుంటే చూస్తూ వూరుకోవడం, వద్దని వారించలేక పోవడం కెసిఆర్ భవిష్యత్తుకే నష్టం. కవిత వంటి యువతులు రాజకీయాలలో ఎదగడానికి ఇదా దారి? సిగ్గుగా లేదా ఆమెకు?

కార్టూన్ స్కేప్




గాలిపటం మీద 'ధరలు' అని రాయగానే ఇట్టే ఆకాశాన్ని అంటిందిరా!

● మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం

## కత్తిమీద సాము చేయగలడా?

తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు చల్లబడ్డాయి. చల్లారిపోతాయని చెప్పలేము కానీ, ప్రస్తుతానికి సద్దుమణిగాయి. ఢిల్లీ అఖిలపక్ష సమావేశానికి పిలిచి ఒక్కొక్కరి చెవిలో ఒక్కొక్క రకం మంత్రం పఠించాడు చిదంబరం. అది నిజంగా చిదంబర రహస్యం. ఆయన ఏమిచెప్పాడో, వీరు ఏమి విన్నారో బయటి ప్రపంచానికి తెలియదు. కానీ ప్రస్తుతానికి అందరూ ఆవేశం తగ్గించుకొన్నారు. ఆగం మానేశారు. వారం రోజులుగా రాష్ట్రం ప్రశాంతంగా వుంది. బందులు, గోలలు లేవు. జనవరి 29 వరకు ఎదురు చూస్తామని తెలంగాణ జెఎసి ప్రకటించింది. అంటే అంతవరకు విరామం అన్న మాట.

ఆ తర్వాత ఏమౌతుందో తెలియదు. వూహించడం కష్టం. మళ్లీ ఉద్యమం చెలరేగుతుందా లేక మరొక వాయిదా పేరుతో వెనక్కునెడతారా? ఏమో, ఆ రహస్యం చిదంబరానికి మాత్రమే ఎరుక! ఎమ్మెల్యేల రాజీనామాల విషయంలో రాజీ లేదని కెసిఆర్ చెప్తున్నాడు. టిడిపి కూడా అదే ధోరణిలో వుంది. కానీ కాంగ్రెస్‌లో మాత్రం ఆ పట్టులేదు. కొందరు వూగిసలాడుతున్నారు. వీరు

కొరవ 14వ పేజీలో

# అతి చేస్తే... అంతే!

టివి5 సంపాదకుల అరెస్టు, సాక్షి టివి ఛానల్ కార్యాలయంలో సోదా పత్రికా ప్రపంచాన్ని ఉలికిపాటుకు గురిచేశాయి. రిలయన్స్ కంపెనీ ఆస్తుల మీద దాడులను ప్రేరేపించే రీతిలో రెచ్చగొట్టే వార్తలు ప్రసారం చేయడం ఈ పరిణామానికి కారణం. పత్రికలు లేదా టివి ఛానళ్ల సంపాదకులను అరెస్టు చేయడం ఎప్పుడో కానీ జరగదు. ప్రైవేటువ్యక్తులు వేసే మాననష్టం దావాలు తప్ప, పోలీసు కేసుల నుంచి, ప్రభుత్వ చట్టాల నుంచి తమకు ఎటువంటి ప్రమాదం ఉండదని పత్రికా లోకం భావిస్తూ వుంటుంది. తమ స్వేచ్ఛకు ఎల్లలు లేవని భ్రమపడుతూ వుంటుంది. ఆ వూహాలోకాన్ని బద్ధలు చేశాయి ఈ సంఘటనలు.

వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదం వెనుక రిలయన్స్ అధినేతల కుట్ర వుందనేది వీరు ప్రసారం చేసిన వార్తల సారాంశం. అయితే అది వారికి వచ్చిన అనుమానం కాదు. వారు సేకరించిన ఆధారాల ప్రకారం అల్లిన కథ కాదు. రష్యాకు చెందిన ఎగ్జయిల్డ్ అనే ఇంటర్నెట్ వెబ్‌సైట్‌లో, ఆ ప్రమాదం జరిగిన ప్రక్కరోజు వ్రాసిన ఒక వెకిలి వ్యాఖ్యానం దానికి ఆధారం. ఆ వెబ్‌సైట్ పనే అది. లేనిపోని, వాస్తవాలకు సంబంధం లేని కల్పితాలు సృష్టించి సంచలనం రేకెత్తించడం వారికొక సరదా. దానిలో వారు వ్రాసింది కూడా తాడు బొంగరం లేని వార్త. రిలయన్స్ సోదరులలో చిన్నవాడైన అనిల్ అంబానీ హెలికాప్టర్ పెట్రోల్ ట్యాంకర్‌లో ఒక రోజు ఇసుక, రాళ్లు కనిపించాయి. వాటి వెనుక ఆయన్ను చంపాలనే కుట్ర వుందని, అందుకు రిలయన్స్ పెద్ద సోదరుడు ముఖేష్ అంబానీ కారకుడని ఒక వదంతి చెలరేగింది అప్పటిలో. అయితే అది నిజం కాదని విచారణలో తేలిపోయింది. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదం జరగగానే ఈ రష్యా వెబ్‌సైట్, అనిల్ అంబానీ హెలికాప్టర్‌లో వలెనే రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్‌లో కూడా రాళ్లు వేసి వుండవచ్చునని, అందుకు కూడా ముఖేష్ అంబానీ ఎందుకు కారకుడు కాకూడదని ప్రశ్నించింది. అయితే తమది "కల్పిత కథనంపై చేసే వూహాగానం" (స్పెక్యులేటివ్ బేస్డ్ ఆన్ హైపోథీసిస్) అని స్పష్టంగా పేర్కొన్నారు.

ఆ వెబ్‌సైట్ నుంచి ఈకథనాన్ని తీసుకొన్న టివి5, సాక్షి, ఎన్‌టివి ఛానళ్లు పెద్ద దుమారం సృష్టించాయి. వైఎస్ మరణం వెనుక కుట్ర వుందని, దానితో ముఖేష్ అంబానీకి సంబంధాలున్నాయని, అందుకోసం వెయ్యి కోట్ల రూపాయల వరకు చేతులు మారాయని...తమ నోటికొచ్చిన కూతలన్నీ కూశాయి ఆ టివి ఛానళ్లు. నిజంగా ముఖేష్ అంబానీయే వైఎస్.రాజశేఖర్‌రెడ్డిని చంపించాడనే అర్థంవచ్చేట్లు వార్తలు ప్రసారం చేశాయి. అసలే కల్పిత కథ, దాని మీద వూహ, దాని మీద చిలువలు పలవులు అల్లడమే కాకుండా, చర్చలు కూడా పెట్టేశారు. వారు తమ నోటికొచ్చిన మాటలు మాట్లాడారు. దానితో వైఎస్ అభిమానుల్లో ఆవేశాలు పెరిగిపోయాయి. రిలయన్స్ ఆస్తులు ధ్వంసం అయ్యాయి. దేశంలోనే అతి పెద్దదైన ఒక పారిశ్రామిక సంస్థ అధినేతల మీద ఆధారం లేని అభాండాలు వేసి, ప్రజలను రెచ్చగొట్టి, సమాజంలో అశాంతిని ప్రేరేపించడం టివి ఛానళ్లు చేయవలసిన పనేనా? పత్రికా స్వాతంత్ర్యానికి అర్థం ఇదేనా? స్వేచ్ఛ అంటే, తమ వ్యాపారం ఎవరినైనా హింసించడమేనా?

ఆ ఛానళ్లు చేసింది ముమ్మాటికీ తప్పు. వారి అరెస్టు, వారి మీద కేసులు పూర్తిగా సమర్థనీయం. అందులో బేధాభిప్రాయం లేదు. పత్రికా స్వాతంత్ర్యానికి, దీనికి సంబంధమే లేదు. ఆ సంపాదకుల అరెస్టు మీద పత్రికా విలేఖరుల సంఘాలు నిరసనలు తెలపడం ఇంకా అధర్మం. పత్రికలలో పని చేసేవారు ఏ తప్పయినా చేయవచ్చు, వారి మీద చర్య తీసుకోవడానికి లేదని చెప్పడం పత్రికల వారు చేయదగిన పనేనా? టివి ఛానళ్ల మధ్య పోటీ వుంది. కోట్లాది రూపాయల పెట్టుబడిని రాబట్టుకోవడానికి సంచలనాలతో ప్రజలను అశాంతికి గురి చేసి రాబడి పెంచుకోవాలన్నది ముమ్మాటికీ దుర్బుద్ధి మాత్రమే. టివి ఛానళ్లలో వస్తున్న వార్తలలో నూటికి తొంబైపాళ్లు ఇదే కోవలో వుంటున్నాయి. వాటివల్ల సమాజంలో ఎన్నో వర్గాల ప్రజలు ఎంతో మానసిక వ్యధకు గురౌతున్నారు. ఎవరికీ చెప్పుకోలేక, ఏమీ చేయలేక మదనపడుతున్నారు. ఇప్పటికైనా టివిఛానళ్ల యాజమాన్యాలు తమ తప్పును గుర్తించి, వార్తల ప్రసారంలో కొంత కొంత అయినా బాధ్యతాయుతంగా మెలగడం మంచిది. అతికి పోతే ఇటువంటి శాస్తులు తప్పవు.

## జనవాణి

### రాష్ట్రపతి పాలన శరణ్యం!

అభివృద్ధి వైపు పరుగులు తీస్తుండిన ఆంధ్రరాష్ట్రానికి చెడ్డరోజులు దాపురించినట్లున్నాయి. ఒకదాని తర్వాత ఇంకొకటిగా ఉపద్రవాలు ముంచుకొస్తున్నాయి. వైఎస్ మరణం, రాష్ట్రంలో వరదలు, జగన్‌ను సిఎం చేయాలంటూ రగడ, కెసిఆర్ దీక్ష, ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు మిన్నంటాయి. ఎనిమిది పార్టీల నేతలను కేంద్ర హోంమంత్రి చిదంబరం ఢిల్లీ పిలిపించి సర్దుబాటు చేసి రాష్ట్రానికి పంపిన మరుసటి రోజే కొన్ని టివి ఛానళ్లలో ప్రసారమైన వార్తల ఆధారంగా రిలయన్స్ సంస్థలపై దాడులు జరిగాయి. రాష్ట్రంలో పాలన వుందా అనే సందేహం ప్రతి ఒక్కరిలో వుంది. ఈ అలజడుల మూలంగా పెద్దలు హాయిగానే వున్నారు. సామాన్యులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ వ్యవహారాలన్నీ సర్దుకొని సామాన్య పరిస్థితులు ఏర్పడాలంటే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనే శరణ్యం.

బి.భాస్కరరావు, నెల్లూరు

### నెల్లూరు నగరాన్ని మార్చాలి!

ఎందరో మహనీయుల జన్మస్థలం నెల్లూరు. చరిత్ర గల ఈ నగర ప్రజల కనీస అవసరాలు తీరడం లేదు. మంచిరోడ్లు, సందుగొందులు శుభ్రంగా లేవు. వీధిలైట్లు వెలగడం లేదు. ప్రక్కనే పెన్నానది వున్నా నీటి సమస్యే. నగరాభివృద్ధికి వందలకోట్ల రూపాయల నిధులొచ్చినట్లు నేతలు చెబుతుంటారు. కాని అభివృద్ధే కానరాదు. నగర సమస్యల పరిష్కారానికి చురుకుగా పనిచేసే కమిషనర్ కావాలి. ఆయన క్షేత్రస్థాయి పర్యటనలు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి.

సి.హెచ్.సురేష్‌బాబు, నెల్లూరు

### సామాన్యుడి బ్రతుకు ఛిద్రం

ఆర్టీసి బస్సు చక్రం ప్రగతికి చిహ్నమని ప్రకటనలు గుప్పించే ఆర్టీసీ యాజమాన్యం బస్సు ఛార్జీలను గుట్టుచప్పుడు కాకుండా పెంచి సామాన్య ప్రయాణీకుల బ్రతుకు ఛిద్రం చేసింది. పల్లె బస్సు నుంచి పట్నం బస్సు వరకూ విపరీతంగా ఛార్జీలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారాన్ని మోపింది. ప్రభుత్వంతో చర్చించకుండా ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎస్‌పి యాదవ్ సొంత నిర్ణయం తీసుకొన్నారని, ముఖ్యమంత్రితోగాని తనతో గాని

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

19-1-1940
పేజీలు : 16 వెల: అణా

### నెల్లూరు ముచ్చట్లు

### నడవకూడదా?

కోవూరు తాలుకా ఆఫీసు వరండాలో అంటే సబ్‌మేజిస్ట్రేట్ కచ్చేరి వెలుపలి వరండాలో గ్రామ మునసబులు చెప్పులు వేసుకొని నడిస్తే చట్టం ఒప్పుకోనంటుందా?

-విమర్శకుడు

### దండువారి సందుపేరు మార్చొద్దు బాబో!

దండువారి వీధి నుండి మధ్యలో దక్షిణ ప్రక్కన ఒక చిన్న సందొకటుంది. దానికి పురాతనంగా దండువారి సందు అని పేరుందట. ఆ సందులో దండువారు అనే ఇంటి పేరిటవారు కొందరు కాపురం వుంటున్నారు. దానికి ప్రస్తుతం ఆ పేరు తీసివేసి ఆ వార్డు కౌన్సిలర్ పుచ్చకాయల రాఘవరెడ్డి పేరు బెట్టారట. దానికి ఆ వీధి వారంతా ప్రొటెస్టు చేస్తున్నారు. ఓ రాఘవరెడ్డి గారు! వాండ్లు వద్దని మొత్తుకుంటూంటే నీకెందుకు ఈనింద? దయచేసి వదలుకోవయ్యా!

-ఒక రెంటు పేయరు

### అల్లూరు బహిరంగ సభలు

అల్లూరు పేటలోను, ఊరిలోను డిశంబర్ 15వ తేది పి.నరసింహంగారి అధ్యక్షత క్రింద జరిగింది. సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు పోరాడుచున్న కాంగ్రేసు సంస్థ సామ్రాజ్య యుద్ధాలకు సహకారం చూపక మంత్రివర్గాలను రాజీనామా యిమ్మన్నందులకు అభినందించుచు ఈ యుద్ధ సమయంలోనే బ్రిటీషు సామ్రాజ్యం నుండి స్వరాజ్యం సంపాదించే తీవ్ర కృషి సలుపవలెనని కోరుచున్నారు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

15-1-1960
పేజీలు: 12 వెల: 0-3-0

### ఇందిరమ్మకు వీడ్కోలు

శ్రీమతి ఇందిరాగాంధీ పన్నెండు మాసాల అధ్యక్షత తర్వాత వీడ్కోలు పుచ్చుకున్నది. శ్రీ నీలం సంజీవరెడ్డి గారు బెంగుళూరు ప్లీనరీలో కాంగ్రెస్ అధ్యక్షులైనారు. విరమిస్తున్న శ్రీమతి ఇందిరమ్మ గారికి వీడ్కోలిస్తూ, క్రొత్త అధ్యక్షుడు సంజీవరెడ్డి గారికి స్వాగతం పలుకుతున్నాము.

### విజయాధిపతి నాగిరెడ్డి చిత్రపటం

దక్షిణ భారత చిత్రపరిశ్రమ సంస్థ విజయసారధి 'విజయ' అధిపతి బి.నాగిరెడ్డి గారి తైలవర్ణ చిత్రపటాన్ని విజయవాడలో ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి నూతన భవనంలో భారత ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షులు అజిత్‌బోస్ ఆవిష్కరించారు. ఫిలిం పరిశ్రమలోని పెద్దలనేకులు నాగిరెడ్డి గారి ప్రతిభను సుగుణ సంపదలను గూర్చి ముచ్చటించారు. విజయవాడలోని ఫిలిం వాణిజ్య మండలి భవనం 1,50,000 రూపాయల వ్యయంతో నిర్మింపబడి నాగిరెడ్డి గారిచే 11వ తేది ప్రవేశోత్సవం జరుపబడింది.

### ఏ.సికి మంత్రిత్వం

ఆంధ్రప్రదేశ్ మంత్రిగా వరింపబడిన ఎసిసుబ్బారెడ్డి గారిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము. సుబ్బారెడ్డి గారు కనీసం ఆంధ్రప్రదేశ్ అవతరణ సమయంలోనే మంత్రి అయి వుండవలసిన వారు. ఇంత కాలం అది వాయిదాపడుటకు సుబ్బారెడ్డిగారి దురదృష్టమే కారణమో లేక సంజీవరెడ్డి గారి కృతజ్ఞతే కారణమో ఇప్పుడు చర్చించడం అనవసరం. ఇప్పుడైనా తీసుకోబడినందుకు సంతోషిస్తున్నాము.

### బజారు ధరలు

| | | | |
|---|---|---|---|
| పాత | మొలగొలుకులు | పుట్టి 1కి | 370.00 |
| కొత్త | మొలగొలుకులు | పుట్టి 1కి | 320.00 |
| కొత్త | జి.బి.24 | పుట్టి 1కి | 315.00 |

# నెల్లూరు ముచ్చట్లు

## విశేషాలు

## ప్రోటోకాల్‌కు మళ్లీ పాతర

నెల్లూరు నగరంలో జరిగిన వివిధ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి కనుసన్నలలో జరుగుతుంటాయన్న విషయం జగమెరిగిన సత్యమే. వైకస్‌రోడ్డులోని చేపల మార్కెట్ వద్ద క్రొత్తగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను 12వ తేది ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రారంభించారు. నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, మేయర్ భానుశ్రీ, ట్రాన్స్‌కో ఎస్ఇ అశ్వర్ధ నారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సబ్‌స్టేషన్ 39వ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేశారు. ఈ డివిజన్ కార్పొరేటర్‌గా రాజీవ్‌భవన్ నిర్వాహకుల్లో ఒకడైన రూప్‌కుమార్ వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ ప్రారంభోత్సవ శిలాఫలకంపై రూప్‌కుమార్ పేరు లేకుండా పోయింది. ఇటీవలే ఆయన నెల్లూరు కార్పొరేషన్ నాల్గవ డివిజన్ ఛైర్మన్‌గా కూడా ఎన్నికయ్యారు. ఇది భరించలేకే శిలాఫలకంలో ఆయన పేరు లేకుండా చేశారన్న గుసగుసలు ప్రారంభోత్సవ సమయంలోనే వినిపించాయి.

## జనంపై దూసుకెళ్లిన లారీ

చిల్లకూరు మండలం తిక్కవరం గ్రామం వద్ద సిలికా లోడుతో చెన్నై వెళ్తున్న లారీ డ్రైవర్ పీకల దాకా తాగి అదుపులో లేక దుకాణాలపై దూసుకెళ్లేలా చేశాడు. 12వతేది జరిగిన ఈ దుర్ఘటనలో ఆరు మోటారు సైకిళ్లు నుజ్జయ్యాయి. ఓ ఆటోను సైతం లారీ ఢీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న పిల్లలు జ్యోతి(11), అక్షయ(3) మృతి చెందగా, అమూల్య, జిలానీబాష, శ్రీనివాసులు, తేజ, సుబ్బమ్మ, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు డ్రైవరుకు దేహశుద్ధిచేసి, లారీని దగ్ధం చేశారు.

## దిండిగల్‌కు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

దేశవ్యాప్తంగా జరుగుతున్న కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా తమిళనాడులో జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి దిండిగల్ జిల్లా ఎన్నికల అధికారిగా పిసిసి కార్యదర్శి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ అథారిటీ కమిటీ ఛైర్మన్ ఆస్కార్ ఫెర్నాండెజ్ ఇచ్చిన సలహామేరకు తమిళనాడు రాష్ట్ర ఎన్నికల అథారిటీ కమిటీ ఛైర్మన్ డాక్టర్ మల్లు రవి ఈ నియామకం చేశారు.

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ పేటకాంప్లెక్స్ రోడ్, నెల్లూరు. సెల్: 9246435618, 9849495615

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

## ఆసిఫ్‌పాషా అరెస్ట్

నెల్లూరులోని రిలయన్స్ వెబ్ వరల్డ్‌పై దాడి చేసిన కేసులో నిందితుడు జెండావీధికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఆసిఫ్‌పాషాను ఎట్టకేలకు 12వ తేది పోలీసులు అరెస్ట్ చేశారు. రిలయన్స్ సంస్థలపై దాడుల తర్వాత పోలీసులకు చిక్కినట్టే చిక్కి ఆయన పరారయ్యారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు తీవ్ర ఒత్తిడికి గురయ్యి ఆయన్ను అరెస్ట్ చేయగలిగారు.

## ఎసిబి వలలో డిప్యూటీ కలెక్టర్

నెల్లూరు తెలుగుగంగ భూసేకరణ విభాగంలో డిప్యూటీ కలెక్టర్ బి.సుబ్రహ్మణ్యంను లంచం తీసుకొంటుండగా 11వ తేది రాత్రి ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. రాపూరు మండలం తెగచర్లకు చెందిన పాలేటి అక్కిరెడ్డికి సంబంధించిన భూములకు నష్టపరిహారం తాలుకు చెక్కులిచ్చే విషయంలో 15వేలు లంచమడగడం ఆయన ఈ వ్యవహారాన్ని ఎసిబి అధికార్ల దృష్టికి తీసుకెళ్లడంతో వల వేసి పట్టుకొన్నారు. సుబ్రహ్మణ్యం ఇంటిపైనా ఎసిబి అధికారులు దాడిచేయగా 20 లక్షల రూపాయల విలువైన మూడు ఇంటి స్థలాల డాక్యుమెంట్లు, 12 గ్రాముల బంగారు, ఒకటిన్నర కిలోల వెండి దొరికాయి.

## మేకపాటిని నిలదీసిన తాగుబోతు

ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 11వ తేది మర్రిపాడులో జరిగిన సభలో తాగుబోతు నిలదీయడంతో ఆయన తన బాధలెవరికి చెప్పుకోవాలని వాపోయిన తీరు చర్చనీయాంశమయ్యింది. కస్తూర్బా బాలికల పాఠశాల ప్రారంభోత్సవ సభలో ఓ తాగుబోతు నువ్వేమి చేస్తున్నావని చంద్రశేఖర్‌రెడ్డిని గట్టిగా అడిగాడు. దీనికి ఎమ్మెల్యే జిల్లాలోనే అతి పెద్ద నియోజకవర్గం ఉదయగిరి. తొమ్మిది మండలాల పరిధిలో ఇది విస్తరించి వుంది. ఇక్కడి మండలాధ్యక్షులు, జడ్పీటీసిలు తీర్చమనే ప్రజా సమస్యలు, వ్యక్తిగత పనులు చేయను తలబొప్పి కట్టిపోతుంది. పార్టీలో ద్వితీయశ్రేణి నాయకుల సొంత పనులు చేయలేక చస్తున్నాను. కత్తిమీద సాము చేస్తున్నట్లు ఎమ్మెల్యే బాధ్యతలు నిర్వహిస్తున్నానని మేకపాటి సుదీర్ఘ వివరణ ఇచ్చేసరికి నిలదీసిన తాగుబోతుకు నిషా దిగిపోయింది.

## రికార్డు సృష్టించిన గుండె డాక్టర్!

నెల్లూరు బొల్లినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో గుండె డాక్టర్ శ్రీనివాసరాజు గత పదేళ్లలో లక్ష మంది రోగులకు వైద్యచికిత్స చేసి అరుదైన రికార్డును స్థాపించారు. డాక్టర్ శ్రీనివాసరాజు మంచి హస్తవాసి గల డాక్టర్. నాలుగు పదుల వయసువాడైనా ఎంతో ఓపికతో రోగులను చూసి స్వాంతన చేకూర్చడంలో దిట్ట. డాక్టర్ శ్రీనివాసరాజు లక్ష మంది రోగులకు వైద్యచికిత్స చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని 10వ తేది హరిత హోటల్‌లో బొల్లినేని హాస్పిటల్ ఆయనకు చిరు సన్మానం చేసింది. పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హాస్పిటల్ వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లినేని భాస్కరరావు, గిరినాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ మహావీర్ ఆసుపత్రిలో పని చేసే సమయంలో డాక్టర్ భాస్కరరావు ఇచ్చిన స్ఫూర్తితో నెల్లూరు బొల్లినేని హాస్పిటల్‌కు వచ్చి రోగులకు సేవలందిస్తున్నట్లు శ్రీనివాసరాజు వినమ్రంగా చెప్పారు.

## ఎంజి బ్రదర్స్ ఇడిని అభినందించిన టాటా!

దేశంలో పేరొందిన పారిశ్రామికవేత్త రతన్ టాటా నెల్లూరు ఎంజిబ్రదర్స్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ గోపాలకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. ఢిల్లీలో జనవరి 6వ తేది టాటా సంస్థలు నిర్వహించిన సమావేశానికి గోపాలకృష్ణ వెళ్లారు. ఎంజి బ్రదర్స్ సంస్థ మంచి సర్వీసుతోపాటు మార్కెట్ షేరును గణనీయంగా పెంచినందుకు రతన్‌టాటా గోపాలకృష్ణను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎంజి బ్రదర్స్ ఆటోమొబైల్స్ ఎండి ఎ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ టాటా డీలర్‌షిప్ సేల్స్‌లో మొదటి ఐదు స్థానాల్లో ఒకటిగా ఎంజి బ్రదర్స్ నిలబడడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, తమ సంస్థను రతన్‌టాటా ప్రత్యేకంగా అభినందించడం మధురమైన అనుభూతి అన్నారు.

## ట్యూబులైట్లు బిగించిన కార్పొరేటర్

నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు లేక చిమ్మ చీకటి కమ్ముకొని వుంది. ఈ విషయమై పాలకులు, అధికార్లలో స్పందన కరవయ్యింది. అయితే 50వ డివిజన్ కార్పొరేటర్ కత్తి శ్రీనివాసులు మాత్రం మిగతా కార్పొరేటర్లకు భిన్నంగా తమ డివిజన్‌లోని విద్యుత్ స్తంభాలకు తానే ట్యూబులైట్లు బిగించి ప్రజల మన్ననలు అందుకొన్నాడు.

## పార్లపల్లి రమణయ్య కాలధర్మం

కోవూరు తాలూకా పార్లపల్లి గ్రామానికి ముప్పయ్యేళ్లకుపైగా కరణంగా పనిచేసిన సమర్థుడు, స్నేహపాత్రుడు, సౌమ్యజీవి పార్లపల్లి వెంకట రమణయ్య 11తేది పరమపదించారు. ఆయన వయస్సు 87 సంవత్సరాలు. కరణాల వ్యవస్థ అమలులో వున్న రోజులలో ఆయనకు ఆ తాలూకా మొత్తం మీద ఎంతో గౌరవం, గుర్తింపు వుండేవి. రెవిన్యూ వ్యవహారాలలో ఆయన పరిజ్ఞానానికి పెద్ద పెద్ద అధికారులే ఆశ్చర్యపోయేవారు. రైతాంగం మనసు నొప్పించకుండా, వారికి తలలో నాలుక వలె మెలిగేవాడు. అపారమైన మిత్ర బృందాన్ని సంపాదించుకొన్నాడు. జమీన్‌రైతు పత్రికకు, కుటుంబానికి అత్యంత ఆత్మీయుడాయన. పబ్లిక్‌వర్క్స్ విభాగం ఇంజినీరు ఇన్ చీఫ్‌గా రిటైర్ అయిన పి.సుధాకర్ రావు ఆయన కుమారులలో ఒకరు.

***

కొరవ 14వ పేజీలో

సంక్రాంతికి విచ్చేసిన NRI పెద్దలకు
వందనం... అభివందనం
వ్యయప్రయాసలతో దేశ విదేశాల నుండి సొంతవారి కోసం - సొంత ఊరికొచ్చి అక్కలూ, బావలూ, మావయ్యలూ, అత్తయ్యలూ, ఆత్మీయులందరినీ కలుసుకుని ఆనందం పంచుకునే ఒకే ఒక్క పండుగ-సంక్రాంతి. సుందర సింహపురిలో ఒకే ఒక్క అందమైన బృందావనం సత్యంజీ నగర్.
NRI పెద్దలారా! సంక్రాంతిని ఎంజాయ్ చేయండి. మీ విలువైన సమయంలో సత్యంజీ నగర్ సందర్శనకు "ఒక్క గంట" కేటాయించండి.

రాష్ట్రంలో అతిపెద్ద, అద్భుతమైన వెంచర్ సత్యంజీ నగర్
వావిలేటిపాడు (ధనలక్ష్మీపురం, ముత్తుకూరు రోడ్డు)
మీ కళ్ళను మీరే నమ్మలేనంత అధునాతన వసతులతో తీర్చిదిద్దబడిన
425 ఎకరాల అద్భుత ప్రపంచం. నెల్లూరు ఎన్.హెచ్. 5 నుండి 3 కి.మీ.- కార్పొరేషన్ లిమిట్స్
చుట్టూ కాంపౌండ్ వాల్, సోలార్ ఫెన్సింగ్, ఎలక్ట్రానిక్ గేట్, బి.టి. రోడ్లు,
చిల్డ్రన్స్ పార్కులు, అతి పెద్ద కళ్యాణ మండపము, ప్లే గ్రౌండ్,
అడుగడుగునా ప్లాంటేషన్, బాబా, విఘ్నేశ్వర, వెంకటేశ్వరస్వామి దేవాలయాలు.
ఫిల్మ్ సిటీని మరిపించే స్ట్రీట్ లైటింగ్, హై కెపాసిటి వాటర్ ట్యాంక్,
24 గం॥లు పటిష్టమైన సెక్యూరిటి సిబ్బంది,
అతి సమీపంలో కార్పొరేట్ విద్య, సూపర్ స్పెషాలిటీ వైద్యం.

ఇన్ని వసతులతో మీరు ఊహించని ధరలలో...
సత్యంజీ
ల్యాండ్ డెవలపర్స్ & బిల్డర్స్
ముత్తుకూరు రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ ప్రక్కన, హరనాధపురం,
నెల్లూరు-3. సెల్: 99494 12959, 93471 18286,
99088 33488, 0861- 2331182,83, 3295633.
www.satyamglanddevelopers.org
e-mail : satyamg_nlr@yahoo.co.in

# ఆదేశాలు కాదు - అమలు జరిగేలా చూడండి!



కూరగాయల మార్కెట్‌లో సక్రమ తూకం ఎప్పుడు?

- కూరగాయల మార్కెట్‌లో మారని పరిస్థితులు

కుక్కతోక ఎంత సరిచేసినా వంకరన్నట్లు నెల్లూరు ఏసి కూరగాయల మార్కెట్‌లో పరిస్థితులు సరిచేయను జిల్లా అధికారులు ఇస్తున్న ఆదేశాలు అమలుకు నోచడమే లేదు. ఎవరు ఎంత చెప్పినా మార్కెట్‌లో వ్యాపారుల రౌడీయిజం తగ్గడంలేదు. వారు చెప్పిందే ధర... వారు తూసిందే తూకమన్నట్లు పరిస్థితులు కొనసాగుతున్నాయి. దీనికితోడు మార్కెట్‌లో అదనపు గదులు నిర్మిస్తుండడంతో వాటి నిర్మాణం, కూరగాయల అమ్మకాల మధ్య పారిశుధ్యం పూర్తిగా క్షీణించింది. గతవారం జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ ఏసి మార్కెట్ పనితీరుపై మార్కెటింగ్ అధికారులతో సమీక్షా సమావేశం జరిపి మండిపడ్డారు. మార్కెట్‌లోని వ్యాపారులు అరకోటి అద్దె బకాయిలు వుండడం పట్ల ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. లైసెన్సు ఫీజులుగా లక్షల రూపాయలు చెల్లించకపోయినా ఎందుకు వూరుకొంటున్నారని ప్రశ్నించారు. మార్కెట్‌లో రెండో ధర్మకాటా ఏర్పాటులో అధికారులు మీనమేషాలు లెక్కించడమేమిటన్నారు. వెంటనే ధర్మకాటాలు పెట్టి వీటి దగ్గర సెక్యూరిటీ గార్డులను కాపలాగా పెట్టమని చెప్పారు. నెలాఖరులోపు మార్కెట్‌లోని అన్ని కూరగాయల షాపుల్లో ఎలక్ట్రానిక్ ధర్మకాటాలు ఏర్పాటుచేయాలన్నారు. వినియోగదారులు అడిగితే వంద గ్రాములు కూరగాయలైనా ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారి ఏసి కూరగాయల మార్కెట్ వంటి చిన్న విషయంలో కలుగజేసుకొని ఆదేశాలివ్వడం సంతోషకరం. కాని అవి అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత మాత్రం మార్కెటింగ్ శాఖాధికారులపైనే వుంది. కానీ మార్కెట్‌లో వారికంత బిర్రులేదు. జాయింట్ కలెక్టర్ మార్కెట్‌లో తన ఆదేశాలు అమలయ్యేలా పౌరసంబంధ శాఖాధికారులు, రెవిన్యూ అధికారుల అజమాయిషీ పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.



# తగ్గిన పండుగ కళ!





సంక్రాంతికి కానరాని గంగిరెద్దులు.

పెద్ద పండుగను ఘనంగా చేసుకోవడం నెల్లూరీయులకు రివాజు. కానీ ఈ యేడాది పండుగ కళ పల్లెల్లో, పట్టణాల్లో పెద్దగా కనబడలేదు. పండుగంటే జనవరి 1వ తేది నుంచి నిత్యావసర వస్తువుల దుకాణాలు, వస్త్రాల దుకాణాలు కళకళలాడుతూ కనిపించేవి. కానీ నగరంలోని వస్త్రదుకాణాల్లో 9, 10, 11 తేదీల్లోనూ జనం క్రిక్కిరిసి కనబడలేదు. కిరాణా అంగళ్లలో గతంలోలా కిలోల లెక్కన బెల్లం, చక్కెర, పచ్చిశనగపప్పు, నూనె కొనుగోళ్లు లేవు. అరిసెల పిండి దంచడం, కాల్చడం కార్యక్రమాలు బాగా తగ్గిపోయాయి. ఉప్పు చెక్కలు, మనుగుబూలు, లడ్లు నామ్‌కేవాస్తేగా తయారుచేస్తున్నారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌లలో స్థిరపడ్డ నెల్లూరీయులు పూర్తిస్థాయిలో స్వంత ఊళ్లకు చేరుకోలేదు. ఉదయగిరి, దుత్తలూరు, సీతారాంపురం, ఆత్మకూరు పల్లెలకు మాత్రం దూరాభారంలో స్థిరపడ్డ స్థానికులొచ్చి చేరారు. పల్లెల సంగతి ఏమిటోగాని పండుగ నెలలో ఇళ్ల ముందు కళకళలాడే ముగ్గులు తగ్గిపోయాయి. వేకువన ముగ్గులు వేసేవాళ్లు పూర్తిగా తగ్గిపోయారు. రాత్రిపూట ముక్తసరిగా ముగ్గులువేసి సరిపెడుతున్నారు. హరిదాసులు, గంగిరెద్దులు, వింతవేషగాళ్లు బాగా తగ్గిపోయారు. గ్రామాల్లో పండుగ నెలలో జరిగే గ్రామదేవతల జాతరలు ముఖ్యమైన గ్రామాల్లోనే జరిగాయి. తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు, ఆర్థిక మాంద్యం, నిత్యావసర వస్తువుల రేట్లు పెరిగిపోవడం, జనానికి కొనుగోలు శక్తిపోవడం ఏది కారణమో లోతుగా విశ్లేషించడం లేదుగాని మొత్తానికి పండుగకళ మాత్రం తగ్గిపోయింది.

# చెవులకు కవచాలు

○ ఎక్కడ చూసినా ఇవే



చలిని కాచుకొనేందుకు ధరించిన రక్షణ కవచం

ఎప్పటికప్పుడు మార్కెట్‌లో ఆధునికంగా వినియోగించుకోను రకరకాల వస్తువులు అందుబాటులోనికి వస్తుంటాయి. చలికాలంలో చలిని కాసుకోను గతంలో మఫ్లర్లు, ఆ తర్వాత మంకీ టోపీలు, చెవుల వరకే వేసుకొనే బాండ్లు అందుబాటులో వుండేవి. వీటికి పోటీగా కాస్త దళసరి గుడ్డతో చేసి దాన్ని ఓ చిన్నపాటి కమ్మీ ఆసరాతో రూపొందించి చెవికి చలి నుంచి రక్షణ కల్పించే కవచాలు నెల్లూరు మార్కెట్‌లో విస్తృతంగా అమ్ముడుపోతున్నాయి. ఇవి అందరికీ అందుబాటు ధరలో 20 రూపాయలకే దొరుకుతుండడంతో వీటిపట్ల ఆసక్తి చూపిస్తున్నారు. అన్నివర్గాల ప్రజలు, వయస్సులో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా పలువురు నగరంలో వీటిని ధరించి చలిని ఎదుర్కొనే ప్రయత్నాలు చేస్తున్నారు.

# నిబంధనలకు తూట్లు



వంట పొలాలే లేఅవుట్లు.

నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళెం, నరసింహకొండ, దేవరపాళెం, జొన్నవాడ పరిసర గ్రామాల్లో అనధికార లేఅవుట్లు యదేచ్ఛగా వెలుస్తున్నాయి. దీనిమూలంగా పంచాయితీ ఆదాయంతోపాటు రెవిన్యూ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ గ్రామాలన్నింటిలోనూ వ్యవసాయ భూముల్లోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం జరుగుతుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని వ్యవసాయ యోగ్యం కానిదిగా మార్చేటప్పుడు కొంత రుసుం ప్రభుత్వానికి చెల్లించాలి. కాని లేఅవుట్లు వేసిన వ్యక్తులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. వాస్తవానికి లేఅవుట్లు వేసే ప్రక్రియ మొత్తం రెవిన్యూ అధికారుల కనుసన్నలలో నడవాలి. పది శాతం రిజర్వు స్థలాన్ని పంచాయితీకి అప్పగించాలి. పది ఎకరాల్లో పది శాతమంటే ఎకరా పోతుందని దీనివల్ల తాము 20 ప్లాట్లు నష్టపోవాల్సి వస్తుందని రెవిన్యూ, పంచాయితీ అధికారులను డబ్బుతో మేనేజ్ చేస్తున్నారు. జిల్లా పంచాయితీ అధికారి కార్యాలయం కొత్తగా గ్రామాల్లో వేసిన లేఅవుట్ల విషయం తనకు తెలియదన్నట్లు వ్యవహరించడం ఈ వ్యవహారంలో పెచ్చుపెరిగిన అవినీతికి పరాకాష్టగా చెప్పుకోవచ్చు.

# ఐరన్ మాత్రలు నిలిపేస్తే ఎలా?

నిద్రపోతున్న వైద్య ఆరోగ్య శాఖాధికారులు




గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఇస్తుండిన ఐరన్ మాత్రలు (ఫైల్‌ఫోటో).

సాధారణ పరిస్థితుల కన్నా గర్భిణులకు ఐరన్ మాత్రలు అవసరం ఎక్కువగా వుంటుంది. రోజుకో మాత్ర వంతున ఐదారు నెలలపాటు వాటిని వాడాల్సిన అవసరం వుంటుంది. దీనికిగాను కుటుంబసంక్షేమ శాఖ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ గర్భిణులకు ఉచితంగా ఐరన్ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకొంటుంది. అయితే గత రెండు నెలలుగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఐరన్ మాత్రలు సరఫరా చేయడం లేదు. గర్భిణులే కాకుండా బాలింతలు, శస్త్రచికిత్స చేయించుకొని రక్తహీనతతో బాధపడేవారు సైతం ఈ మాత్రలు వాడుతుంటారు. గ్రామీణుల్లో ఎక్కువమంది ప్రసవానికి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలే దిక్కు. ఇక్కడ ఐరన్ మాత్రలు లేకపోవడంతో ప్రసవానికి గర్భిణులు సిద్ధమైపోవడం ఆందోళన కల్గించే పరిణామం. మాతా శిశు మరణాలను తగ్గించే ఏకైక లక్ష్యంతో జిల్లాలో ఆర్‌సిహెచ్-2 కార్యక్రమం అమలవుతోంది. నిధుల సమస్యలేని ఈ పథకం ద్వారానైనా ఐరన్ మాత్రల కొనుగోళ్లకు వైద్య ఆరోగ్యశాఖ ఎందుకు ప్రయత్నించడం లేదో అర్థం కావడం లేదు. ఈ వ్యవహారమై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి స్పందించాల్సిన అవసరం ఎంతైనా వుంది.




నెల్లూరు నగరంలో పారిశుధ్య పరిస్థితులు క్షీణించి జనం జబ్బులబారిన పడుతున్నా పాలకవర్గం పట్టించుకోలేదంటూ కార్పొరేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం కార్యకర్తలు.

**నూతన సంవత్సర కానుకగా ఆర్టీసి పెంచిన బస్సు ఛార్జీల మూలంగా జిల్లా ప్రజలపై రోజుకు 9లక్షల రూపాయల మేర టిక్కెట్ల భారం పడింది. పెంచిన చార్జీల మూలంగా నెల్లూరు ఆర్టీసి రీజియన్ నెలకు 2 కోట్ల 70 లక్షల రూపాయల ఆదాయాన్ని సముపార్జిస్తుంది.**

## ● పెరిగిన ఆర్టీసి చార్జీలతో

# జనం సతమతం!



ఆర్టీసి ప్రయాణం బహుభారం.

నూతన సంవత్సరం కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసి బస్ చార్జీలను పెంచడం జరిగింది. ఇటీవలకాలంలో ఆయిల్ ధరలు పెరగకపోయినా కూడా చార్జీలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపింది ప్రభుత్వం. రాష్ట్రంలో ఏర్పడిన ఆర్థికసంక్షోభం నుంచి గట్టెక్కేందుకు అకస్మాత్తుగా బస్ చార్జీలను పెంచి తద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా కనబడుతుంది. పెంచిన ఆర్టీసి బస్ చార్జీల వలన జిల్లా ప్రజలపై రోజుకు 9లక్షల రూపాయల వంతున నెలకు 2కోట్ల 70లక్షల రూపాయల భారం పడింది.

### ప్రజాగ్రహం

వున్నపళంగా ఆర్టీసి చార్జీలు పెంచడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం అంగీకరించింది. కార్మికుల కోర్కెలు తీర్చేందుకు సిద్ధపడడం వల్ల ఆర్టీసీ పై 465కోట్ల అదనపు భారం పడనుంది. ఈ అదనపు భారాన్ని తగ్గించుకునేందుకు చార్జీలను పెంచక తప్పదని ఆర్టీసి ప్రకటించింది. నెల్లూరు రీజియన్ పరిధిలో నెల్లూరు-1, నెల్లూరు-2, కావలి, ఉదయగిరి, ఆత్మకూరు, రాపూరు, వెంకటగిరి, సూళ్ళూరుపేట, వాకాడు, గూడూరు ప్రాంతాలలో డిపోలున్నాయి. ఈ డిపోల పరిధిలో 500 రూట్లలో దాదాపు వెయ్యికి పైగా ఆర్టీసి బస్సులు నడుపుతుంది. ప్రయాణీకుల సౌకర్యార్థం 31 బస్‌స్టేషన్లు మరియు 70 బస్‌షెల్టర్లను నిర్మించడం జరిగింది.

నెల్లూరు ఆర్టీసికి ఎక్స్‌ప్రెస్ సర్వీసులు-197, హైటెక్-50 వోల్వో-6, ఆర్డినరి-580, అద్దె బస్సులు 100 వున్నాయి. కాలం చెల్లిన బస్సులు మరో 300లకు పైగా వున్నాయి. ఆర్టీసి చార్జీలు పెంచినవిధంగా ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించడం లేదు. బస్‌స్టేషన్లలో కనీస సదుపాయాలు లేకపోవడం, ప్రయాణం మధ్యలో బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలిచిపోవడం తరచూ జరుగుతున్నాయి. వీటిని అధిగమించేందుకు ఆర్టీసి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రయాణీకులు ఎన్ని ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం మానేశారు. మారుమూల గ్రామాలకు ఆటోలు వెళ్తున్నాయన్న కారణంతో బస్సులను నడపడం నిలిపివేశారు. ఆర్టీసి బస్సులు నిర్ణీత సమయానికి రాకపోవడం వలన గ్రామీణ ప్రాంత ప్రజలు ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు.

ఆర్టీసి యాజమాన్యం పెంచిన చార్జీల ప్రకారం ఆర్డినరీ బస్సులో 8 పైసలు, ఎక్స్‌ప్రెస్‌లో 10పైసలు, హైటెక్‌లో 13పైసలు, వోల్వోలో 25పైసల వంతున పెంచడం జరిగింది. ఇంతకు ముందు నెల్లూరు నుంచి విజయవాడకు 281 రూపాయలు వుండగా పెంచిన చార్జీల ప్రకారం 349 రూపాయలు చెల్లించాలి. తిరుపతికి 150 రూపాయలుండగా, ప్రస్తుతం 175 రూపాయలు చెల్లించాలి. చెన్నైకు 200 రూపాయలుండగా ప్రస్తుతం 240 రూపాయలుగా నిర్ణయించారు. బెంగుళూరుకు 400 రూపాయలుండగా పెంచిన చార్జీల ప్రకారం 520 రూపాయలుగా నిర్ణయించడం జరిగింది. పెంచిన చార్జీల ప్రకారం నెల్లూరు రీజియన్‌కు రోజుకు తొమ్మిది లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుంది.

### కొత్తవారికి బాదుడు

ఇవే కాకుండా సీజన్ టిక్కెట్ల ధరలు కూడా పెరగనున్నాయి. చార్జీలను పెంచే నాటికి సీజన్ టిక్కెట్లు తీసుకున్న ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బంది వుండదు. కొత్తగా సీజన్ టిక్కెట్లు పొందేవారు మాత్రం పెరిగిన చార్జీల ప్రకారం చెల్లించాల్సి వుంటుంది. ఆర్థికమాంద్యం కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్న ప్రజానీకంపై రాష్ట్రప్రభుత్వం చార్జీల పేరుతో అదనపు భారం మోపింది. త్వరలో ఇంటిపన్నులు, విద్యుత్ ఛార్జీలు పెరిగే అవకాశం కూడా వుందని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండి పడింది. ఆదాయాన్ని పెంచుకునేందుకు చార్జీలు, పన్నులు పెంచడం బాధాకరం.

### బస్సులెక్కని అధికారులు

నెల్లూరు ఆర్టీసి రీజియన్ పరిధిలో ఆర్టీసి డిపో మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లు విధి నిర్వహణ కోసం పది ప్రత్యేక వాహనాలను వినియోగిస్తున్నారు. వీరు వాహనాల్లో ప్రయాణించి అదనంగా ఆర్టీసికి అందించే సేవలంటూ ఏమీ వుండవు. వీరు వాడే వాహనాలకు ఆర్టీసి డీజిల్, పెట్రోల్ సమకూరుస్తుంటుంది. గతంలో పై అధికారులను నెలలో 15రోజులు బస్సుల్లో ప్రయాణించి ప్రయాణీకుల ఇబ్బందులు, బస్సు కండీషన్, సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని ఆర్టీసి యాజమాన్యం సూచించింది. అయితే ఈ సలహాలను జిల్లాలో ఎవరూ పాటించిన దాఖలాల్లేవు.

డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్లకు కేటాయించిన వాహనాలను స్వంతపనుల కోసం ఎక్కువగా వాడుకొంటున్నారు. షాపింగ్‌కు వెళ్లడం, పిల్లలను పాఠశాల, కళాశాలల్లో దింపి రావడం శుభకార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. ఫలితంగా ఆర్టీసికి నష్టం వాటిల్లుతుంది. వీటిపై కూడా ఆర్టీసి యాజమాన్యం దృష్టిసారిస్తే కొంతమేర నష్టాలను తగ్గించుకొనే అవకాశం వుంటుంది. ఈ క్రమంలో ఆర్టీసి ఛార్జీల పెంపుపై సామాన్య, మధ్యతరగతికి చెందిన ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.

J

#### చార్జీలు తగ్గించాలి!



ఇటీవల ఆర్టీసి యాజమాన్యం చార్జీలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపింది. డీజల్, పెట్రోల్ ధరలు పెరిగినప్పుడు గతంలో బస్సు చార్జీలు పెంచేవారు. ప్రస్తుతం అటువంటివి ఏమీ లేకుండానే అకస్మాత్తుగా బస్సు చార్జీలను పెంచడం బాధాకరం. ప్రభుత్వం జోక్యం చేసుకొని పెంచిన బస్సు చార్జీలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి.

**కె.ప్రసన్నకుమారి, పూడివర్తి**

#### చార్జీలు పెంచడం బాధాకరం!



ప్రస్తుతం ఆర్థిక పరిస్థితులలో ఆర్టీసి బస్సు చార్జీలను పెంచి జిల్లా ప్రజలపై ప్రభుత్వం అదనపు భారం మోపింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్య మానవుడు జీవించలేని పరిస్థితులు వున్నాయి. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం ఆలోచన చేయకుండానే చార్జీలు పెంచి ప్రజలను మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది.

**డి.వెంకటేశ్వరరెడ్డి, పాములూరు**

#### అదనపు భారం!



రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి ప్రకటన లేకుండానే ఆర్టీసి బస్సు చార్జీలను పెంచి ప్రజలకు అదనపు భారం మోపడం బాధాకరం. ఇప్పటికే పెరిగిన ధరలతో సతమతమవుతూ జీవనం సాగిస్తున్న సగటుమనిషి దీన్ని భరించడం కష్టతరంగా వుంటుంది. ప్రభుత్వం పునరాలోచించి పెంచిన చార్జీలను తగ్గిస్తే బాగుంటుంది.

**కె.లలితమ్మ, నెల్లూరు**

#### ప్రభుత్వ అనాలోచిత చర్య



ఆర్టీసి బస్సు చార్జీలను పెంచడం ప్రభుత్వ అనాలోచిత చర్య. ప్రభుత్వం ఆర్థికసంక్షోభం నుంచి గట్టెక్కేందుకు చార్జీలను పెంచినట్లు కనిపిస్తుంది. ఆర్టీసిలో సంభవిస్తున్న నష్టాలపై దృష్టిసారించి సరిదిద్దకుండా ప్రజలపై అదనపు భారం వేయడం సమంజసంగా లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదాయ మార్గాలను అన్వేషిస్తే బాగుంటుంది.

**రాజేంద్రప్రసాద్, రేబాల**

#### ప్రభుత్వ నిర్ణయం మార్చుకోవాలి!



రాష్ట్రంలో రాజకీయ, ఆర్థిక సంక్షోభం ఏర్పడి ప్రజలు అనేక రకాలుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో ఆర్టీసి యాజమాన్యం చార్జీలను పెంచడం, ఇందుకు రాష్ట్రప్రభుత్వం ఆమోదిస్తూ నిర్ణయం తీసుకోవడం సమంజసంగా లేదు. ఆర్థిక పరిస్థితి నుంచి బయటపడేందుకే ముందుగా ఆర్టీసి చార్జీలను పెంచింది.

**ఎస్.మల్లిఖార్జున, నెల్లూరు**




నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగిన కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ సమావేశంలో జ్యోతిప్రజ్వలన చేసిన అమరావతి హోటల్ అధినేత కృష్ణారెడ్డి, మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షురాలు రత్నమ్మ తదితరులు.

## వికటిస్తున్న వ్యాక్సిన్లు!

ప్రభుత్వం పలురకాల వ్యాధులు రాకుండా అందజేస్తున్న వ్యాక్సిన్లు వికటించి ప్రాణాంతకం అవుతున్నాయి. ఇందుకూరుపేట మండలం కామరిక గ్రామంలో గిరిజన కాలనీకి చెందిన లింగమ్మ అనే బాలిక ధనుర్వాతానికి గురై నెల్లూరులో చికిత్స పొందుతుంది. ఇటీవల ప్రభుత్వం అందజేసిన వ్యాక్సిన్ ఈ బాలిక వేయించుకోవడంతో అది వికటించింది. స్థానికంగా సరైన చికిత్స అందుబాటులో లేకపోవడంతో రేబాల ఆస్పత్రికి తరలించారు. పాపం వ్యాక్సిన్ చేయించుకొన్న పాపానికి ఆ బాలిక చావు బ్రతుకుల మధ్య పోరాటం చేస్తోంది. ఆరోగ్య కేంద్రాల ద్వారా పంపిణీ జరిగిన వ్యాక్సిన్‌ల కారణంగా చిన్నారి ప్రాణాల మీదకు రావడంతో తల్లితండ్రులు విలవిల్లాడి పోతున్నారు.

• వెంకటగిరిలో

## విద్యుత్ వెలుగులు

వెంకటగిరి పట్టణంలో విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణకు 1.50 కోట్లు మంజూరైనాయి. గత యాభై ఏళ్లుగా విద్యుదీకరణకు ఎలాంటి నిధులు లేకపోవడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వుండింది పట్టణంలో పరిస్థితి. నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ మంత్రిగా వున్నప్పుడు రాజీవ్ విద్యుదీకరణ పథకం క్రింద కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అవి ఇప్పటికి ఆమోదానికి నోచుకొన్నాయి. శిథిలమైపోయిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు ఇక మోక్షం లభించనుంది. పట్టణం విస్తరించడంతో క్రొత్త

### రాజీవ్ విద్యుద్దీకరణ పథకం మంజూరు

స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు అవసరమయ్యాయి. ఈ పరిస్థితులలో 1.50 కోట్ల రూపాయల నిధులు మంజూరు కావడంతో పాత స్తంభాల స్థానంలో 120క్రొత్త వాటితోపాటు ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నారు. అడ్డదిడ్డంగా వున్న కరెంటు తీగలను సరిచేయడంతోపాటు లోఓల్టేజ్ సమస్యను పరిష్కరించనుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాలైన పెరియవరం ఎస్సీకాలనీ, అంబేద్కర్ కాలనీ, బీడికార్మికుల కాలనీ, ఎస్ఆర్‌నగర్ తదితర ప్రాంతాలలో క్రొత్త స్తంభాలు, కనెక్షన్లు రానుండడంతో ఆ ప్రాంతీయులు రాజ్యలక్ష్మమ్మకు కృతజ్ఞతలు చెప్తున్నారు.

## హైటెక్ వ్యభిచారం

• బుచ్చి - ముంబాయి రోడ్డుపై విశృంఖలం

ఆత్మకూరు పట్టణంలో వ్యభిచారం హైటెక్ పద్ధతులలో సాగుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న వ్యభిచారానికి అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులు క్రొత్త క్రొత్త పద్ధతులను అవలంభిస్తున్నారు. ముఖ్యంగా శివారు ప్రాంతాలైన బొగ్గేరు, ఇటుకబట్టీలు, నాగులపాడు రోడ్డుకు ఇరువైపుల వున్న పొలాలు, కొత్తగా నిర్మించిన లే అవుట్లు, బైపాస్‌రోడ్డు, జగన్నాధరావుపేటలోని కొన్ని ఇళ్లలో వ్యభిచారం జోరుగా సాగుతోంది. నెల్లూరు-ముంబాయి రోడ్డుపైన వాసిలి గ్రామం నుంచి కరటంపాడు గ్రామం మధ్యలో పలువురు వ్యభిచారిణులు వాహనాలను నిలిపి బేరసారాలు సాగిస్తుండడంతో ఆ ప్రాంతంలో కుటుంబాలతో కలసి ప్రయాణించేవారు ఇబ్బందిపడాల్సి వస్తోంది. లారీ డ్రైవర్లు వీరి వలలో సులభంగా పడుతుండడంతో వ్యభిచార కార్యక్రమాలను నిర్వహించేవారు వాహనాలను ఉపయోగించి ఈ కార్యకలాపాలు కొనసాగిస్తుండడం విశేషం. అసలే ఎయిడ్స్ మహమ్మారి కోరలుచాచిన ప్రస్తుత పరిస్థితులలో ఇంత పెద్ద ఎత్తున వ్యభిచార కార్యక్రమాలు సాగుతున్నా దీనిని అదుపుచేయాల్సిన పోలీసులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఇది అడ్డు అదుపు లేకుండా సాగుతోంది. మరోవైపు మద్యం సేవించి వాహనాలను నడుపుతుండడం అధికం కావడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.

## గంగపట్నంలో ముంగమూరు!

ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని చాముండేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి తనశక్తి మేర కృషిచేస్తానని నెల్లూరు నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి హామీ ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకొన్న ఆయన ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన చాముండేశ్వరి అమ్మవారి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు పూర్తిగా తోడ్పడుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ నాయకులతోపాటు ఇందుకూరుపేట మండల బిసినాయకులు పాల్గొన్నారు.


# ఆరవ వర్ధంతి



అమ్మ అనే పదానికి నిర్వచనంగా
అనురాగానికి ప్రతిరూపంగా
మా హృదయాలలో ప్రేమ పుష్పాలు పూచించిన అమృతమూర్తి
స్వర్గీయ కలవకూరు వెంకటరెడ్డి (KVR) గారి సతీమణి
శ్రీమతి కలవకూరు వెంకమ్మ గారి
ఆరవ వర్ధంతి (19-01-2010) సందర్భంగా
వారి పవిత్ర ఆత్మకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం...



కీ॥శే॥ కలవకూరు వెంకమ్మ గారు
స్వర్గీయ కలవకూరు వెంకటరెడ్డి (KVR) గారి సతీమణి
వ్యవస్థాపకులు : కెవిఆర్ బ్రదర్స్, నెల్లూరు.
మరణం : 19-01-2004

...కెవిఆర్ కుటుంబ సభ్యులు

## రామోజీ ఇంట్లో ముసలం



ఈనాడు రామోజీరావు ఇంట్లో మరో ముసలం పుట్టింది. గతంలో రెండోకొడుకు సుమన్ రామోజీని విమర్శిస్తూ రచ్చకెక్కాడు. సాక్షి దినపత్రికలో రామోజీపై ధ్వజమెత్తుతూ సుమన్ ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా యిచ్చాడు. అప్పట్లో ఈ సంఘటన సంచలనం కలిగించింది. ఆ తర్వాత రామోజీ తన కొడుకుతో సర్దుబాటు చేసుకొన్నాడు. ఇప్పుడు తాజాగా తోడల్లుడు అప్పారావు సాక్షి పత్రిక ద్వారా రామోజీని తిట్టిపోశాడు. రామోజీ విజయంలో అప్పారావు పాత్ర ఎంతో వుంది. కొంతకాలంగా ఈ తోడల్లుళ్ల మధ్య తీవ్ర విభేదాలు చోటుచేసుకున్నాయి. ఆస్తుల్ని పంచుకొని విడిపోయారట. దీన్ని ఆసరాగా తీసుకొని వైఎస్ కొడుకు జగన్ మరోసారి రామోజీని దెబ్బతీసే ప్రయత్నం మొదలెట్టాడు. అప్పారావును ఒప్పించి రామోజీ అక్రమాల్ని సాక్షి ద్వారా చెప్పించాడు. రామోజీ ఫిల్మ్‌సిటీకి చెందిన వందలాది ఎకరాలు అక్రమంగా కొనుగోలు చేశారంటూ అప్పారావు రచ్చకెక్కాడు. అంతే కాకుండా ఈనాడు పత్రికను అడ్డంపెట్టుకొని రామోజీ చేసిన అవకతవకల్ని కూడా ఎండగట్టాడు. మొత్తానికి రామోజీ ఇంట్లో ముసలం బాగానే ముదిరినట్లుంది.

## క్యాంప్ ఆఫీసంటే రోశయ్యకు హడల్



సిఎం క్యాంప్ ఆఫీసంటే రోశయ్య హడలిపోతున్నాడు. వైఎస్ ఈ క్యాంప్ ఆఫీస్‌లోకి మారాకనే ప్రమాదానికి గురికావడం జరిగింది. నిన్నమొన్నటిదాకా క్యాంప్ ఆఫీసులో జగనే కొలువై వున్నాడు. ఇటీవలనే క్యాంప్ ఆఫీసును ఖాళీ చేశాడు. అయితే దాన్ని ఆనుకొని వున్న సిఎం నివాసాన్ని మాత్రం జగన్ యింకా ఖాళీ చేయలేదు. ఈ పరిస్థితుల్లో క్యాంప్ ఆఫీసుకు మారడం అంత మంచిది కాదని రోశయ్య భావిస్తున్నాడు. కలిసిరాని క్యాంప్ ఆఫీసు కంటే ఇరుకైన తన నివాసమే మంచిదనుకొని సర్దుకుపోతున్నాడు. అయితే ముఖ్యమంత్రి సమీక్షా సమావేశాలకు హాజరయ్యేవారికి ఆయన్ను కలవడానికి వచ్చే సందర్శకులకు మాత్రం తీవ్ర అసౌకర్యంగా వుంటోంది. రోశయ్య వెంటనే క్యాంపు కార్యాలయానికి మారాలంటూ ఇప్పటికే పలువురు రాజకీయులు గోల చేస్తున్నారు. అయినా సెంటిమెంట్ వల్ల రోశయ్య మాత్రం క్యాంప్ కార్యాలయానికి దూరంగానే వుంటున్నాడు.

## ఆటంకాల్లో కూడా 'అదుర్స్'



జూనియర్ ఎన్టీఆర్ నటించిన అదుర్స్ సినిమా ఏ ముహూర్తంలో మొదలైందోకానీ ఆది నుంచీ ఆటంకాలు ఎదురవుతూనే వున్నాయి. సుమారు 30కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ సినిమాకు రెండేళ్లు పట్టాయి. ఈ సినిమా నిర్మాణదశలో జూనియర్ ఎన్టీఆర్‌కు కారు ప్రమాదం జరిగింది. ఫలితంగా ఆర్నెల్లపాటు సినిమా మూలపడింది. ఎలాగో అలాగే సినిమా పూర్తయినా విడుదల సమయానికి రాష్ట్రంలో పరిస్థితులు అల్లకల్లోలంగా తయారయ్యాయి. గత యేడాది డిసెంబర్‌లో విడుదల కావల్సి వున్న ఈ సినిమా జనవరికి వాయిదా పడింది. తీరా విడుదల తేదీని ప్రకటించేసరికి తెలంగాణ ఉద్యమవాదులు ఈ సినిమా విడుదలను వ్యతిరేకిస్తున్నారు. విడుదల ముందురోజే థియేటర్ల వద్ద ఎన్టీఆర్ ఫెక్సీలను, కటౌట్‌లను తగలబెట్టారు. ఇలావుండగా ఈ సినిమా కథను కాపీ కొట్టారంటూ కరీంనగర్‌కు చెందిన ఎన్టీఆర్ అభిమాని కొత్త వివాదాన్ని లేవనెత్తాడు. ఈ కథను తాను స్వయంగా ఎన్టీఆర్‌కు వినిపించానంటున్నాడు. ఇన్ని వివాదాలకు మూలమైన ఈ సినిమా పేరుకు తగ్గట్టే 'అదుర్స్' అనిపించుకుంటోంది.

## తప్పులో నోరేసిన డిజిపి



డిజిపి పోస్టు మహిమో! ఏమో తెలీదు కానీ ఆ కుర్చీ ఎక్కిన వాళ్లంతా నోటిని అదుపు చేసుకోలేక వివాదాల్లో కూరుకపోతున్నారు. పాత డిజిపి యాదవ్ యిష్టం వచ్చినట్లు మాట్లాడి చివరకు కుర్చీకి దూరమయ్యాడు. ఇప్పుడు కొత్తగా ఆ కుర్చీలో కూర్చున్న గిరీష్‌కుమార్ కూడా నోటిని అదుపులో పెట్టుకోనందుకు నానా విమర్శలకు గురవుతున్నాడు. చిన్నరాష్ట్రాల్లో నక్సల్స్ ప్రాబల్యం పెరుగుతుందని, వనరుల కొరత కారణంగా నక్సల్స్‌ను ఎదుర్కోవడం కష్టమౌతుందని నోరు జారాడు. దీంతో గిరీష్ రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడంటూ తెరాస నిప్పులు చెరుగుతోంది. రాష్ట్రాల విభజన రాజకీయ నిర్ణయానికి సంబంధించింది. రాష్ట్ర పరిపాలనలో పాలుపంచుకునే అధికారులు రాజకీయాలు మాట్లాడితే ఎలా అంటూ తెరాస శ్రేణులు గిరీష్‌కుమార్‌పై విమర్శలు కురిపిస్తున్నాయి. గత అనుభవాన్ని దృష్టిలో పెట్టుకోకుండా కొత్త డిజిపి నోరుజారి తగిన మూల్యాన్నే చెల్లించుకుంటున్నాడు.

## ఆంధ్ర ఉద్యోగుల అగచాట్లు



ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి హైదరాబాద్‌లోని ఆంధ్రప్రాంత ఉద్యోగులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రాంత ఉపాధ్యాయుల పట్ల నిరసన మొదలైంది. ఇప్పుడు సాక్షాత్తు రాష్ట్ర సచివాలయానికి కూడా ఈ గాలి సోకింది. ఇరిగేషన్, ఎక్సైజ్, రెవెన్యూ వంటి కీలక శాఖల్లో ఆంధ్ర ప్రాంత ఉద్యోగుల ప్రాధాన్యం ఎక్కువగా వుందంటూ కొందరు తెలంగాణ వాదులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. నిన్న మొన్నటి దాకా కలిసి మెలసి వున్న ఆంధ్ర, తెలంగాణ ప్రాంత ఉద్యోగుల్లో వైషమ్యాలు పెరుగుతుండటం సచివాలయంలోని ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ఈ ధోరణి అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సోకితే పరిపాలన కష్టమేనంటూ కొందరు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారట.

## ఖజానాకు చిల్లు సబ్సిడీకి చెల్లు



రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ కావడంతో విపత్తుసాయంగా రైతులకు అందాల్సిన ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తం 584 కోట్ల రూపాయలు ఇప్పటిదాకా అందలేదు. రాష్ట్రంలో ఏర్పడిన కరవు, వరదల వల్ల నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ కింద 584 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. అయితే ఖజానా ఖాళీ కావడంతో ఈ మొత్తాన్ని యింతవరకు విడుదల చేయలేదు. నెలలు గడుస్తున్నా సాయం అందకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అయినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. వ్యవసాయమంత్రి నిర్వహించిన సమీక్షలో ఈ విషయం వెల్లడికావడంతో సంబంధిత అధికారులపై మంత్రి రఘువీరా చిందులు తొక్కాడు. నిధులు విడుదల కాకపోతే ఆ విషయాన్ని తన దృష్టికి తేవాలని కోపగించారు. ఖజానాలో నిధులు లేకపోవడం వల్ల విపత్తు సాయం ఇప్పట్లో రైతులకు అందే అవకాశమే లేదని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు చెవులు కొరుక్కొంటున్నారు.

## ద్రౌపది రాద్ధాంతం



మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రచించిన 'ద్రౌపది' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి రావడం అన్యాయమంటూ పలువురు సాహిత్యకారులు, మహిళా సంఘాలు గొడవ చేస్తున్నాయి. మహాభారత మూల కథలోలేని ద్రౌపది పడగ్గది శృంగారాన్ని పచ్చిగా వర్ణించి స్త్రీ జాతిని అవమానించాడంటూ వీరు యార్లగడ్డను దుయ్యబడుతున్నారు. మహాభారతంలో కారణజన్మురాలిగా పుట్టిన ద్రౌపది మహోన్నత వ్యక్తిత్వాన్ని పూర్తిగా దిగజార్చి ఒక బజారు స్త్రీగా వర్ణించడం రచయిత కుసంస్కారానికి అద్దం పడుతోందంటూ వీరు మొత్తుకుంటున్నారు. యార్లగడ్డ రచన చౌకబారుదైనా తన రాజకీయ పలుకుబడితో అకాడమీ అవార్డును సంపాదించుకున్నాడన్నది బహిరంగ రహస్యమేనని వీరు అంటున్నారు. ఇప్పటికే ఈ వివాదం ముదిరి టీవీల్లో ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయి. మొత్తానికి ద్రౌపదికి వచ్చిన ప్రశంసలకంటే విమర్శలే ఎక్కువకావడంతో రచయిత యార్లగడ్డకు తలనొప్పిగా వుందట.

## నాటుకోడి బిర్యానీతో నిరసన



నిరసనలు వేనవేల రకాలని చాటి చెప్పాడు నెల్లూరు హాట్ బ్రాండ్ రాజకీయనాయకుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి. సంక్రాంతి పండుగకు సీమాంధ్ర వెళ్లిన బస్సులను, లారీలను, రైళ్లను తిరిగి తెలంగాణా గడ్డకు రానివ్వమన్న తెలంగాణా నాయకుల వైఖరిని నిరసించను ఐదవ నెంబరు జాతీయ రహదారిపై ఒక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రహదారిపై వెళ్తున్న తెలంగాణ జిల్లాల రిజిస్ట్రేషన్ గల వాహనాలను ఆపి అందులోని డ్రైవర్లు, క్లీనర్లు, ప్రయాణీకులను దింపి వారిని ఆత్మీయంగా తమ శిబిరం వద్దకు తీసుకవెళ్లి, నెల్లూరు స్పెషల్ నాటుకోడి బిర్యానీకి స్వీటును సైడ్ డిష్‌గా వడ్డించి తినిపించారు. సమైక్యాంధ్ర కిళ్లీలు చివరన ఇచ్చి వారిని సంతోష పరిచారు. మనమంతా భాయి... భాయి అని ఆలింగనం చేసుకొనేసరికి తెలంగాణవాదులు కూడా హాయిగా త్రేన్చి శ్రీధర్‌రెడ్డికి 'జై' కొట్టి మరీ సాగిపొయ్యారు.

## 'వివేకా' సుద్దులు



నోటికొచ్చినట్లు మాట్లాడి వార్తల్లోని వ్యక్తిగా వుండడం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణంపై రష్యన్ వెబ్ పత్రిక 'ఎగ్జయిల్డ్' ప్రచురించిన గాలి కథనానికి నెల్లూరులో రిలయన్స్ సంస్థలపై దాడులకు వివేకా ఆదేశాలు కారణమయ్యాయి. కాని ఇవేమీ ఆయన రాజకీయ పలుకుబడి ముందు బయటకు రాలేదు. పైపెచ్చు 8తేది హైదరాబాద్‌లో టివి-5 ప్రతినిధుల అరెస్టును ఖండిస్తూ ఆ టీవీ ప్రసారం చేస్తుండిన ప్రత్యక్ష కార్యక్రమంలో పత్రికాస్వేచ్ఛ వుంటుందని దీనికి ఉదాహరణగా సామాన్యులకు అర్థంకాని వాటర్‌గేట్, బోఫోర్స్ కుంభకోణాలను ప్రస్తావించారాయన. మరి నాలుగున్నరేళ్ల క్రితం జరిగిన నెల్లూరు కార్పొరేషన్ ఎన్నికల్లో మీడియా ప్రతినిధులను, వివిధ ఛానళ్ల కెమెరామెన్లను, ఫోటోగ్రాఫర్లను దుడ్డుకర్రతో స్వయంగా చావబాదిన వివేకానందరెడ్డికి అప్పుడు పత్రికాస్వేచ్ఛ గుర్తుకు రాలేదేమో? మొత్తం మీద ఎమ్మెల్యేగారి సుద్దులు ఆయనకు వర్తించవా?

## పోలేరమ్మకు కోపమొచ్చింది



అల్లూరు పోలేరమ్మంటే ఆల్ ఆంధ్రాలో భలే ఫేమస్. అమ్మ జాతరకు దేశంలో ఎక్కడెక్కడో స్థిరపడ్డ అల్లూరీయులంతా తరలివస్తారు. గ్రామదేవతను తనవితీరా దర్శించి చల్లగా చూడమని ప్రణమిల్లుతారు. వందలఏళ్ల నుంచి వైభవంగా జరిగే పోలేరమ్మ జాతరలో ఎప్పుడూలేనట్లుగా ఈసారి బాణసంచా పేలుళ్లలో అపశృతులు దొర్లాయి. కాల్చను సిద్ధం చేసిన బాణసంచా పేలి 25మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఆగ్రహించిన అమ్మ తిరిగి కరుణించబట్టి అందరూ బతికి బట్టకట్టారు. పోలేరమ్మకు అంతకోపమొచ్చే తప్పును ఏం చేసామన్న ఆత్మశోధనలో అల్లూరీయులంతా పడ్డారు.

## కీచక దహన పర్వం



మహా భారతంలో ఈ పర్వ మెక్కడిదబ్బా అని అందరిలోనూ సందేహం కలగవచ్చు కాని జిల్లాలో కాముకుడొకడు ఈ కీచక దహన పర్వాన్ని రచించాడు. ఇందుకూరుపేట మండలం జంగాలదొరువులో డొక్కా ప్రసాద్ అనే కీచకుడు ఓ వివాహితపై అత్యాచారయత్నం చేశాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుప్రక్కలవాళ్లు వచ్చి ఈ కలియుగ కీచకుడికి దేహశుద్ధి చేశారు. దీన్ని మనసులో పెట్టుకొన్న ప్రసాద్ 7తేది రాత్రి తాను అత్యాచారయత్నానికి ఒడిగట్టిన వివాహితకు నిలువనీడ లేకుండా చేయాలంటూ ఆమె ఇంటిని తగులబెట్టి కీచక దహన పర్వాన్ని సృష్టించాడు. కలి కాలపు బుద్ధులని వీటినే అనాలేమో?

## ఖంగుతిన్న 'జపనీయులు'



జపనీయులు జిల్లాలోని తడ మండలం మాంబట్టు గ్రామంలో అపాచీ బూట్ల ఫ్యాక్టరీని ఏర్పాటుచేసి వేలమంది నిరుద్యోగులకు వుద్యోగాలిచ్చారు. ఈ ఫ్యాక్టరీ, ఇక్కడి ఉద్యోగులను చూసి దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కూడా పలు సమావేశాల్లో గొప్పగా చెప్పారు. జపనీయులు విపరీతంగా శ్రమిస్తారు. ఇలాగే అపాచీలో పనిచేసే వుద్యోగులను శ్రమించమంటే రోజుకు ఎనిమిది గంటలే పని చేస్తామని పెద్ద పోరాటం చేశారు. ఇటీవల జరిగిన తెలంగాణ, సమైక్యాంధ్ర పోరాటాల్లో సెలవులకు గాను డిసెంబరు నెలలో రెండురోజుల జీతం కట్ చేయను కంపెనీ సిద్ధపడగా కార్మికులు కిష్కింధ కాండను జపనీయులకు రుచి చూపారు. ఎవరినైనా మహాబాగా బెదిరించడంలో సిద్ధహస్తుడైన సూళ్లూరుపేట సిఐ సుబ్బారెడ్డి తనను బెదిరించడాన్ని జపనీయుడైన అపాచి మేనేజింగ్ డైరెక్టర్ తట్టుకోలేక కన్నీళ్ల పర్యంతమయ్యాడు. కార్మికులకు ఫుల్ జీతమిచ్చి ఇదేం ఖర్మరా బాబు అంటూ జపాన్‌భాషలో వాపోయాడు.

## మాఘమాసంలో వచ్చే రథసప్తమి ప్రాముఖ్యత!



సమస్త లోకాలకు వెలుగు రేఖలను ప్రసరింపజేసేవాడు సూర్య భగవానుడు. ఆ ఆదిత్యుని జయంతిని రథసప్తమిగా జరుపుకొంటారు. సప్తాశ్వ రథారూఢుడైన సూర్య నారాయణుడు సకల చరాచర సృష్టిలో వెలుగు దివ్వెలను అందిస్తూ మానవాళికి శుభాలు కల్గిస్తాడు. అరుణోదయవేళ సూర్యునికి నమస్కరిస్తే సకల పాపాలు, సర్వరోగాలు తొలగిపోతాయని మహర్షులు చెప్పివున్నారు. మాఘశుద్ధ సప్తమిని రథసప్తమి అని కూడా అంటారు. రథసప్తమిని ఈ నెల 22వ తేది జరుపుకోనున్నారు. ఇతర మాసాలలో వచ్చే సప్తమి తిథులకన్నా మాఘ మాసంలో వచ్చే సప్తమి విశేషమైనది. సూర్యుని గమనం సప్త అశ్వాలతో కూడిన బంగారు రథంపై వుంటుందని వేదాలు చెప్తున్నాయి. భాస్కరుడి గమనాన్ని ఉత్తరాయణం, దక్షిణాయణం అని రెండు విధాలుగా ఆచరిస్తారు. ఆషాడం నుంచి పుష్యమాసం వరకు దక్షిణాయనంగా, సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించేది ఉత్తరాయణంగా భావిస్తారు. దక్షిణాయణంలో సూర్యుడు దక్షిణదిశలోనూ, ఆ తర్వాత ఉత్తరదిశలోను పయనిస్తాడు. రథసప్తమిరోజు పవిత్రమైనదిగా భావిస్తారు. ఆరోజున ఉదయాన్నే పుణ్యస్నానమాచరించి సూర్యునికి నమస్కరించి పూజించినట్లయితే శుభం కల్గుతుందని విశ్వాసం. అర్కం అంటే జిల్లేడు ఆకులు. ఆదిత్యుని అర్క అనికూడా పిలుస్తారు. సూర్యనారాయణ స్వామికి ప్రీతికరమైన జిల్లేడు ఆకులతో స్నానం చేసి, చిక్కుడు ఆకులతో పొంగలి నైవేద్యంగా పెట్టినట్లయితే ఎంతో మంచిదని పురాణ కథనం. ఆ విధంగా చేసినట్లయితే ఏడు జన్మల పాపాలు తొలగుతాయని, రోగాలు తొలగిపోతాయని ప్రతీతి.

ఆది దేవ నమస్తుభ్యం ప్రసీదం భాస్కర
దివాకర నమస్తుభ్యం ప్రభాకర నమోస్తుతే

అంటూ పూజించినట్లయితే సకల శుభాలు సమకూరుతాయి.


సంక్రాంతి శుభాకాంక్షలు

మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, తోటి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, ఏజెంట్లకు, మా సంస్థ ఉన్నతికి సహకరిస్తోన్న ప్రతి ఒక్కరికి హృదయపూర్వక సంక్రాంతి శుభాకాంక్షలతో...

DTCP APPROVED LAY-OUT DTCP 2010

3 నూతన మెగా వెంచర్లు
D.T.C.P. Approved Lay-out

అతి తక్కువ ధరలలో...
సంక్రాంతి కానుకగా
అతి త్వరలో... ప్రారంభం



మీ... వి. నాగేశ్వరరావు
Cell : 9849053994.

SLS CONSTRUCTIONS
శ్రీ లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్
ఫస్ట్ ఫ్లోర్, హోటల్ అభిరామ్, ఆచారివీధి, నెల్లూరు.

UK ADS

# ఇందుకూరుపేట బిట్-2 పంచాయితీలోనూ కానరాని అభివృద్ధి!

ఇందుకూరుపేట మండలంలోని ఇందుకూరుపేట బిట్-2 గ్రామపంచాయితీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండల కేంద్రంగా వున్న ఈ పంచాయితీ అభివృద్ధి గురించి పట్టించుకొనే వారులేకుండా పోయారు. గతంలో సర్వేపల్లి నియోజకవర్గంలో వున్న ఈ మండలాన్ని నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా కోవూరు అసెంబ్లీ నియోజకవర్గంలో విలీనం చేయడం జరిగింది. గతంలో సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా వున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిల హయాంలో కొంతమేర సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపట్టడం జరిగింది.

ఈ గ్రామ పంచాయితీ పరిధిలో సి.వి. కండ్రిగ, పాములవారి పాలెం, బి.సి కాలనీ, రావూరు దొరువు, నారాయణపురం, మేనాటి పాళెం తదితర గ్రామాలు వున్నాయి. 15 వార్డులు కలిగిన పంచాయితీలో 18 వందల కుటుంబాలు, 7వేల జనాభా, 5వేల మంది ఓటర్లు నివసిస్తున్నారు. ప్రతి సంవత్సరం పంచాయితీ అభివృద్ధికి 12వ ఆర్థిక సంఘం, ఎస్.ఎఫ్.సి నిధులు కలిపి దాదాపు 3 లక్షల రూపాయల గ్రాంట్లు విడుదల చేస్తుంది ప్రభుత్వం. ఇవే కాకుండా వివిధ పన్నుల రూపంలో మరో 2లక్షల రూపాయలు వసూలు చేస్తుంటారు.



**డ్రైనేజి కాల్వలు లేవు !**

కొద్దిపాటి వర్షం వచ్చినా గ్రామంలోని వీధులలోకి నీరు చేరిపోతుంది. నిల్వ వున్న నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజి కాల్వలు కూడా లేవు. మురికినీటిలో దోమల ఉత్పత్తి కేంద్రాలు తయారవుతున్నాయి. గ్రామంలో గ్రావెల్‌రోడ్లు నిర్మించి డ్రైనేజి కాల్వలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– పాలెపు కొండయ్య



**రోడ్లు వేయాలి!**

ఇంటి పన్నులు వసూలు చేసుకుంటున్న పంచాయితీ అధికారులు సమస్యల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మా గ్రామం చుట్టూ పొలాలు వున్న కారణంగా దోమల బెడద అధికంగా వుంటుంది. వీటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలి. అలాగే గ్రామంలో రోడ్లు సక్రమంగా లేకపోవడం వలన నడిచి వెళ్లాలంటేనే ఇబ్బందికరంగా వుంటుంది.

– ఈదూరు వెంకయ్య

కాంగ్రెస్ పార్టీకి చెందిన భీమవరపు వెంకటనరసారెడ్డి పంచాయితీ సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. అయితే పంచాయితీ పరిధిలోని గ్రామాలలో త్రాగునీటి సమస్య, వీధిలైట్లు కొంతమేర పర్వాలేదు. ప్రధానంగా పారిశుద్ధ్యం, డ్రైనేజి కాల్వల నిర్మాణం, గ్రామాలలో అంతర్గత రోడ్లు సరిగా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షం వచ్చినా కూడా గ్రామాలలోని ప్రధాన వీధులలో నీరు నిల్వ వుంటుందని గ్రామస్థులు చెప్పారు. గతంలో వేసిన సిమెంటు రోడ్లు కూడా లోలెవల్‌గా వేయడంతో వీటిపైన కూడా నీరు నిలిచిపోతుంది.

పంచాయితీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఈ పంచాయితీకి రెగ్యులర్ కార్యదర్శిని నియమించకపోవడం వలన మైపాడు పంచాయితీ కార్యదర్శి ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నాడు. ఈయన కార్యాలయానికి ఎప్పుడు వస్తాడో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయితీలోని సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.



వీధులలో పేరుకపోయిన చెత్తాచెదారం.



పునాదుల వద్దే నిలిచిపోయిన ఇందిరమ్మ గృహం.

---

అవినీతి కథ

# భూబకాసురిడిగా మారిన చౌకచర్ల విఆర్వో

**గ్రామ తలారిగా పనిచేసే నలబోతు శీనయ్యకు గ్రామ రెవిన్యూ అధికారిగా ప్రమోషన్ వచ్చింది. అంతే ఆయనలో నిద్రాణంగా వున్న అవినీతి అధికారి విజృంభించాడు.**

అతనో గ్రామ రెవెన్యూ అధికారి. పేరు నలుబోతు శీనయ్య. గత సంవత్సరం గ్రామతలారి నుంచి రెవెన్యూ అధికారిగా పదోన్నతి పొందాడు. ప్రస్తుతం విడవలూరు మండలంలోని చౌకచర్ల గ్రామ రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే అతనికి సంబంధం లేని భూమి వ్యవహారంలో తలదూర్చి ప్రభుత్వం భూమి కొనుగోలు పథకం ద్వారా పేదలకు అందజేసిన భూమిని స్వాధీనం చేసుకొని ఇతరులకు కౌలుకిచ్చి దానిలోని ఫలసాయాన్ని దర్జాగా అనుభవిస్తున్నాడు.

పూర్తి వివరాల్లోకి వెళితే విడవలూరు మండలం పార్లపల్లి అరుంధతీయవాడకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు పది సంవత్సరాల క్రితం ఎస్సీ కార్పొరేషన్ భూమి కొనుగోలు పథకం ద్వారా ఒక్కొక్కరికి 54సెంట్ల వంతున అందజేయడం జరిగింది. గతంలో ఈ గ్రామంలోనే తలారిగా పని చేసిన నలబోతు శీనయ్య, అతని భార్య శీనమ్మ, తల్లి వెంకమ్మ, అక్క గద్దె రమణమ్మ, బావమరిది భార్య క్రిష్ణవేణిలతోపాటు దక్కా స్వర్ణలత, ఆరుమళ్ల వెంకటసుబ్బమ్మ, ఆరుమళ్ల సునీతలకు భూమిని మంజూరు చేశారు. వీరందరికీ దంపూరు గ్రామ పరిధిలోని సర్వేనెంబరు-73ఎ లో ఎనిమిది ఎకరాలను కొనుగోలు చేశారు.

భూమి కొనుగోలు పథకం ప్రతిపాదనల దగ్గర నుంచి రిజిస్ట్రేషన్ వరకు మొత్తం వ్యవహారాన్ని విఆర్వో నడిపించారు. లబ్ధిదారులకు మంజూరు చేసిన భూమి పత్రాలన్నీ కూడా ఇతనే వుంచుకున్నాడు. లబ్ధిదారులకు కొంత నగదును అందజేసి ఇందుకు ప్రామిసరి నోటును వ్రాయించుకొన్నాడు. లబ్ధిదారులందరు అక్షరజ్ఞానం లేని వారు కావడం వలన విఆర్వో ఎక్కడ వ్రేలిముద్రలు వేయమంటే అక్కడ వేశారు. 2008 సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం రుణమాఫీ పథకం వర్తింప చేయడంతో లబ్ధిదారులకు భూమి కొనుగోలు పథకం కోసం మంజూరు చేసిన రుణాలు పూర్తిగా మాఫీ చేశారు. దీంతో భూమిని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేశారు.

రుణమాఫీ విషయాన్ని కూడా సదరు లబ్ధిదారులకు తెలియపరచ లేదు. ఇటీవల ముగ్గురు లబ్ధిదారులు తమకు మంజూరు చేసిన భూముల్లో సాగు చేసేందుకు సిద్ధపడగా కౌలు చేస్తున్న వారు అడ్డుకోవడం జరిగింది. అడ్డుకోవడమే గాకుండా లబ్ధిదారులపైనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిజమైన లబ్ధిదారులు ఏం చేయాలో దిక్కుతోచక అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ ప్రభుత్వం పేదలకు అందజేసిన భూములను స్వాధీనం చేసుకోవడం నేరం. ఈ విషయం సదరు విఆర్వోకు తెలిసినా కూడా తనను ఎవరు ఏం చేయులేరన్న ధీమాతో గత పది సంవత్సరాల నుంచి అనుభవిస్తున్నాడు. ఒకే దళిత వర్గానికి చెందిన విఆర్వో తోటివారి భూములను అక్రమించడం సిగ్గు చేటు.

విఆర్వో లబ్ధిదారుల భూములను స్వాధీనం చేసుకున్న విషయం మండల తహసీల్దార్‌కు తెలిసినా కూడా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వున్నాయి. గ్రామ రెవెన్యూ రికార్డులలో లబ్ధిదారుల పేర్లు వున్నాయి. అధికారులు జోక్యం చేసుకోకుండా విఆర్వో తన పలుకుబడి ఉపయోగిస్తున్నాడని లబ్ధిదారులు వాపోతున్నారు. వీరికి కేటాయించిన భూమి ప్రస్తుత మార్కెట్‌ధర ప్రకారం ఎకరా 5లక్షల నుంచి 6లక్షల రూపాయలు పలుకుతుంది. వీటిని కాజేయాలన్న దురుద్దేశంతో లబ్ధిదారులను వివిధ రకాలుగా భయపెడుతూ ఉన్నతాధికారులను కలవనీయకుండా చేస్తున్నాడు. గత పది సంవత్సరాల నుంచి ఫలసాయం అనుభవిస్తున్న విఆర్వో భూములను ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. లబ్ధిదారులకు చెందిన భూములను తన భూములుగా చెప్పుకొంటూ ముందుగా తన దగ్గర వుంచుకున్న ఒరిజినల్ రికార్డులను చూపిస్తూ కొనుగోలు చేసేందుకు వచ్చే వారిని నమ్మిస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగిగా వుంటూ పేదలకు భూమి కొనుగోలు పథకం క్రింద పంపిణీ చేసిన భూములను ఆక్రమించి అనుభవించడంపై జిల్లా కలెక్టర్ ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం.



విఆర్వో దురాక్రమించి పంటవేసుకొన్న పొలం.

# సమస్యల వలయంలో జూనియర్ కాలేజీలు!

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సమస్యల వలయంలో చిక్కుకుపోయి వున్నాయి. మెజార్టీ శాతం జూనియర్ కాలేజీలు సైన్స్ విద్యార్థులకు ఉపయోగపడని ప్రయోగశాలలు, కానరాని లైబ్రరీలు, చాలీచాలని గదులతో నడుస్తున్నాయి. జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కాలేజీలున్నాయి. వీటిలో ఉదయగిరి, మర్రిపాడు, కొండాపురం, దగదర్తి, ఆత్మకూరు, నాయుడుపేట, గూడూరు, పొదల

## పట్టించుకోని ప్రభుత్వం

కూరు, బుచ్చిరెడ్డిపాళెం జూనియర్ కాలేజిల్లో విద్యార్థులకు తగినట్లుగా తరగతి గదులు లేవు. దీనివల్ల చెట్ల క్రింద తరగతులు నిర్వహిస్తున్నారు. పేరుకే సైన్స్ గ్రూపులు కాని ఇక్కడ ప్రయోగశాలల వసతి లేదు. దరిదాపులు 23 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోనూ లెక్చరర్ల కొరత వేధిస్తుంది. మార్చి నెల సమీపిస్తున్నా సిలబస్ పూర్తికాక విద్యార్థుల్లో ఆందోళన హెచ్చుతుంది. వింజమూరు, అల్లూరులలో నడుస్తున్న ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లోనూ పలు సమస్యలు తిష్టవేసి వున్నాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల పట్ల ప్రభుత్వమే సవతి తల్లి ప్రేమ చూపిస్తుండడంతో ప్రైవేట్ జూనియర్ కాలేజీలు కళకళలాడుతున్నాయి.



నెల్లూరులోని కెఎసి ప్రభుత్వ జూనియర్ కాలేజిలో అధ్వాన్నంగా వున్న మంచినీటి కొళాయిలు.

# సెంట్రల్ క్రైం స్టేషన్‌లో వర్గపోరు!




నిత్యం వార్తల్లో నెల్లూరు సిసిఎస్ స్టేషన్.

నేరాలను అరికట్టాల్సిన పోలీసులే వర్గాలుగా మారడంతో పలు నేరాలు నిగ్గుతేలని పరిస్థితి సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఎదురౌతుంది. దొంగతనాలు, దోపిడీలు తదితర అన్నిరకాల నేరాలకు సంబంధించి ఇక్కడి నుంచి పరిశోధన చేస్తుంటారు. అలాంటి చోట పనిచేసే పోలీసులు రెండు గ్రూపులుగా మారి నిత్యం ఒకరిపై ఒకరు తగాదా పడుతుండడం చర్చనీయాంశమయ్యింది. అందులోనూ ఈ రెండు గ్రూపులకు నాయకత్వం వహించే వాళ్లు ప్రతిష్టాత్మకమైన మెడల్స్‌ను సాధించినవారు కావడం గమనార్హం. ఇటీవల ఎసిబి అధికారులకు పట్టుబడ్డ ఎఎస్ఐ ఒక గ్రూపుకు నాయకత్వం వహించేవాడట. నిత్యం ఈ రెండు గ్రూపుల మధ్య విధులు నిర్వహించడం దగ్గర్నుంచి రికవరీలు, దొంగలను పట్టికోవడంలోనూ ప్రతి దానిలో గొడవలు జరుగుతుండడంతో పలు కేసులు పెండింగ్‌లో వుంటున్నాయి. గత నెలలో ఒక కేసుకు సంబంధించి నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో రికవరీ చేసిన తర్వాత స్వల్ప మొత్తం రికార్డుల్లో చూపించారట. గ్రూపు తగాదాల నేపథ్యంలో ఈ సమాచారం కాస్త బయటకు పొక్కడంతో ఎస్పీ దీనిపై విచారణకు ఆదేశించారు. ఇంతగా సిసిఎస్‌లో గ్రూపుల మధ్య యుద్ధం జరుగుతున్నా అధికారులు దానిపై దృష్టిసారించకపోవడంతో వాటి ప్రభావం కేసులపై పడి ఫిర్యాదుదారులు నష్టపోతున్నారు.

# అమ్మకానికి స్పోర్ట్స్ సర్టిఫికేట్లు!

## ఫీజుతో ఉన్నత చదువులకు పెద్దల పిల్లలు



भारतीय खो खो संघ
KHO-KHO FEDERATION OF INDIA
Dr. PADMASHREE VITHALRAO VIKHE PATIL
20th SUB JUNIOR NATIONAL
KHO-KHO CHAMPIONSHIP 2005-06
Recognised by Ministry of Sports & Youth Affairs, Govt. of India.
Affiliated to Asian Kho-Kho Federation, Indian Olympic Association
Participation Certificate
Awarded to K. SRINATH S/o. VENKAIAH
Date of Birth 21-04-1992 representing ANDHRA
State / Region as Player / Manager / Coach / Official in 20th Sub-Junior National Kho-Kho Championship 2005-06 organised by Punjab Kho-Kho Association, under the auspices of Kho-Kho Federation of India, at Polo Ground, PATIALA from 9th to 13th November, 2005.

నెల్లూరు మార్కెట్‌లో క్రీడా సర్టిఫికేట్లు.

క్రీడల్లో కనీస నైపుణ్యం వుండ పనిలేదు, ఎలాంటి స్థాయిల్లోనూ ఆడనవసరం లేదు... కానీ జాతీయస్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొన్నట్లు క్షణాల్లో సర్టిఫికేట్లు ఇచ్చేందుకు క్రీడా సంఘాలు నగరంలో రెడీగా వున్నాయి. ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించాల్సిన క్రీడాసంఘాలు సర్టిఫికేట్లకు వున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వాటికి అందినంత డబ్బు దండుకోవడానికి పూనుకోవడం సిగ్గుపడాల్సిన విషయం. 2006 నుంచి చాపక్రింద నీరులా ఈ సర్టిఫికేట్ల అమ్మకం గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతోందట. మెడిసిన్, ఇంజనీరింగ్‌లో క్రీడా సర్టిఫికేట్లు వున్న అభ్యర్థులకు తక్కువ ఫీజుతో సీట్లు పొందే అవకాశం వుండడంతో దీన్ని అవకాశంగా మలచుకొన్న కొన్ని క్రీడాసంఘాలు తప్పుదోవ తొక్కుతున్నాయి. కనీసం ఆయా క్రీడల గురించి కనీస అవగాహన లేని వారికి జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్నట్లు సర్టిఫికేట్లు ఇవ్వడం వెనుక పలువురు పెద్దల హస్తం వున్నట్లు సమాచారం. ఖోఖో క్రీడలో ఈ బండారం బయటపడినా ఇది గత కొన్ని సంవత్సరాలుగా పలు క్రీడలకు ఈ జాడ్యం పాకినట్లు తెలుస్తోంది. ఒలంపిక్ క్రీడ అయిన సాఫ్ట్‌బాల్, కామన్‌వెల్త్ క్రీడ అయిన నెట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ తదితర క్రీడల్లో పాల్గొనకపోయినా వీటిల్లో పాల్గొన్నట్లు సర్టిఫికేట్లు ఇవ్వడం వెనుక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్లు సమాచారం. నగరానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూలు కరస్పాండెంట్ తన కూతురికి ఇలాంటి సర్టిఫికేట్ ఇప్పించి మెడిసిన్‌లో సీటు పొందారట. పలువురు పిఇటిలు, డిఇఓ కార్యాలయంలో పనిచేసే పలువురు సిబ్బంది దొంగ సర్టిఫికేట్లతో తమ పిల్లలకు ఇంజనీరింగ్, మెడిసిన్‌లో సీట్లు పొంది వున్నారంటే ఎంతగా ఈ సర్టిఫికేట్లు ప్రక్కదారి పట్టింది తెలుస్తున్నది.

# రోగాలబారిన నగరం



వెత్తతొట్ల వద్ద పేరుకున్న వెత్తాచెదారం.

నగర ప్రజల బాగోగుల గురించి పట్టించుకోవాల్సిన పాలకులు సొంత సంపాదనపై దృష్టిసారించడంతో నగర ప్రజలను పలురకాల రోగాలు చుట్టుముట్టాయి. అన్నింటికీ ప్రధాన కారణం దోమలు. వీటి నిర్మూలనకు మునిసిపల్ పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు రోగాలతో సహవాసం చేయాల్సి వస్తోంది. నిన్నటివరకు చికున్‌గున్యా, డెంగ్యూతో ప్రాణాల మీదకు తెచ్చుకొన్న నగరవాసులను ఇప్పుడు మలేరియా వ్యాధి పట్టి పీడిస్తోంది. ఒక్కసారి పలురకాల రోగాలు విజృంభించడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వైద్య చికిత్సలకు వెళ్లే వారితో అన్ని ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇంతగా జనం రోగాల బారిన పడుతున్నా కార్పొరేషన్ పాలకవర్గం, అధికారులకు చీమకుట్టినట్లయినా లేకపోవడం వారి చర్మ మందాన్ని తెలియజేస్తున్నది. వీరికి తగినట్లే వైద్య ఆరోగ్య శాఖ మొద్దు నిద్రపోతుండడం విచారకరం. జిల్లాలోని పలు ప్రాంతాలతోపాటు నగరంలో డెంగ్యూ బారినపడి పలువురు మృతిచెందినప్పటికీ ఈ శాఖ అధికారులు ఎక్కడా డెంగ్యూ కేసులు లేవని చెప్పడం నవ్వుల పాలవుతోంది. ఇబ్బడిముబ్బడిగా చికున్‌గున్యా, డెంగ్యూ, క్రొత్తగా మలేరియా జ్వరాలు ప్రజలను అతలాకుతలం చేస్తున్నా వైద్యశాఖలో చలనం లేదు. 138కి పైగా డెంగ్యూ కేసులు నమోదైతే ఇవన్నీ అనుమానాస్పదన కేసులుగా పేర్కొనడంపై ప్రజలు ఆగ్రహిస్తున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పాలకులు దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడం, వైద్యఆరోగ్య శాఖాధికారులు తగిన చర్యలు చేపట్టకుండా రోగాలే లేవని ప్రకటించడం వారి పనితీరును తెలియజేస్తున్నాయి.

# విద్యుత్ కర్మాగారంతో ఇబ్బందులు

## జనవిజ్ఞాన వేదిక నేత వెల్లడి.



డాక్టర్ విజయకుమార్.

ముత్తుకూరులో ఏర్పాటవుతున్న నెల్‌కాస్ట్ విద్యుత్ కర్మాగారం వల్ల ప్రజలకు ముప్పు పొంచి వుందని, పర్యావరణం దెబ్బతినే ప్రమాదం వుందని జనవిజ్ఞాన వేదిక నాయకుడు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.విజయకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కర్మాగారం ఏర్పాటుపై అధిక సంఖ్యాకుల ప్రజల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకోవాల్సి వుండగా ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని ఆయన విమర్శించారు. ఈ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం పట్ల స్థానిక ప్రజలతోపాటు, చుట్టుప్రక్కల గ్రామాల వారు అయిష్టంగా వున్నారని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టుల ఏర్పాటు వల్ల ఆర్థిక ప్రగతి ప్రక్కనబెడితే ఆరోగ్యం దెబ్బతింటుందని హెచ్చరించారు. చుట్టుప్రక్కల కొన్ని కిలోమీటర్ల వరకు పర్యావరణానికి, మానవాళికి తీవ్ర విఘాతం కల్గుతుందన్నారు. గ్లోబల్ వార్మింగ్‌ను దృష్టిలో పెట్టుకొని జిల్లా ఉన్నతాధికారులు తగిన విధంగా వ్యవహరించాలని కోరారు.

# ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలు!

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలు సామాన్య మానవుడిపట్ల శాపంగా పరిణమించాయి. రాష్ట్ర వ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పేద, మధ్యతరగతికి చెందిన ప్రజలు పెరిగిన ధరలతో సతమతమవుతూ జీవనం కొనసాగించలేకపోతున్నారు. రాష్ట్రంలో గత నెల రోజుల నుంచి ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర ఉద్యమాలు, ఆందోళనల ఫలితంగా రాజకీయ సంక్షోభం ఏర్పడి ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. నిత్యావసర వస్తువుల ధరలతోపాటు ఆకుకూరలు, కూరగాయల ధరలు కూడా బాగా పెరిగిపోయాయి.



పప్పులుదకడం కష్టమే.

పెరిగిన ధరలకు సరుకులు కొనుగోలు చేసి జీవించడం కష్టమని ప్రజలు ఆందోళన చెందుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. మరో ప్రక్క ప్రతిపక్షాలు ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తున్నా అటు ప్రభుత్వంలోగాని ఇటు అధికారులలో స్పందన కానరావడంలేదు. ఆందోళనలు, ధర్నాలు నిర్వహించి వినూత్నంగా ప్రజలు, తమ నిరసనలు తెలియజేస్తున్నా ధరలు మాత్రం దిగి రావడం లేదు. ఈ క్రమంలో ధరల పెరుగుదల, ప్రభుత్వం నిర్లక్ష్యంపై పలువురు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.



## ధరలను అదుపు చేయాలి!

ఇటీవల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి కొనలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. పప్పులు, చింతపండు, ఆకుకూరలు, కూరగాయలు తదితర వస్తువులన్నింటిపై వ్యాపారులు ధరలు పెంచేశారు. ప్రభుత్వానికి ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు కలుగజేసుకొని పెరిగిన ధరలను నియంత్రించేందుకు చొరవ తీసుకోవాలి.

- గౌరి, నెల్లూరు.



## ప్రభుత్వం కళ్లు తెరవాలి

ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వంలో ఏమాత్రం చలనం కనిపించడం లేదు. ప్రజల ఓట్లతో గెలుపొందిన ప్రజాప్రతినిధులు కూడా ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. నగరంలోని వ్యాపారస్తులు అన్ని వస్తువులపై ధరలు పెంచి ప్రజలను వివిధ రకాలుగా దోపిడి చేస్తున్నారు.

- సుజాత, నెల్లూరు.



## ధరలపై నియంత్రణ ఏది?

ఇటీవల రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ సంక్షోభం కారణంగా పరిపాలన స్తంభించిపోవడం మూలంగా ధరలు బాగా పెరిగిపోయాయి. పెరిగిన ధరలను నియంత్రించాల్సిన అధికారయంత్రాంగం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా వైఫల్యం చెందింది. సామాన్య మానవుడు విలవిలలాడుతున్నా తమకు సంబంధం లేదన్న విధంగా పాలకులు వ్యవహరించడం బాధాకరం.

- మీరా, నెల్లూరు.



## ప్రజల్ని దోచుకొంటున్నారు

వ్యాపారులు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల్ని దోచుకుంటున్నారు. పాలకులు, అధికారులు ధరలను నియంత్రించకపోవడం వల్ల వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వ్యాపార సంస్థలపై తనిఖీలు లేకపోవడంతో అడ్డుఅదుపు లేకుండా పోయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పెరిగిన ధరలను వెంటనే తగ్గించి సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

- నాగరాజు, నెల్లూరు.




Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11



● ఆత్మసంతృప్తి కలిగించే అరవయ్యవ మజిలి!

# ఇంతలో ఎన్ని మెట్లెక్కాడు?

అందనంత ఎత్తా....
తారా తీరం...
దాని సంగతేందో చూద్దాం రా...

అని ఒక సినిమా పాట వుంది. బిజెపి అగ్ర నేత ముప్పవరపు వెంకయ్యనాయుడు జీవిత ప్రస్థానాన్ని నిశితంగా పరిశీలించి చూస్తే ఆ పాటే జ్ఞాపకం వస్తున్నది. ఎక్కడివాడు, ఎక్కడకు వెళ్లాడు? ఎంతటివాడు, ఎంతెత్తుకు ఎదిగాడు? ఆర్థికంగా హార్థికంగా, రాజకీయంగా రాజసంగా వెంకయ్యనాయుడు అధిరోహించిన సోపానాలు చూసిన వారు నమ్ముతారే తప్ప చెప్తే వినేవారు చెవిలో పువ్వులు పెడుతున్నారనుకోవడం సహజం. మంగలగుంట పోకిరీ పిల్లోడు ఢిల్లీ అధికార ప్రాంగణంలో మకాం పెడతాడని, దేశాన్ని నడిపించే వారి సరసన సమహోదాతో కూర్చుంటాడని ఎవరూహించారు? ఆ వూహ ఎట్లా సాధ్యం?



రేపు 17తేది వెంకయ్యనాయుడి షష్టిపూర్తి. స్వర్ణభారత్ ప్రాంగణంలో ఆత్మీయుల నడుమ ఆ శుభకార్యాన్ని ఒక పండుగగా జరుపుకోబోతున్నాడు. ఒక వ్యక్తి జీవితంలో అరవై ఏళ్ల వయస్సు రావడం పెద్ద గొప్పకాదు. చెట్టుకు పుట్టకు కూడా ఏళ్లు వస్తాయి. రాయికి రప్పకు కూడా వయస్సు పైన బడుతుంది. పెరిగే ఒక్కొక్క ఏడు తరిగే ఆయువుకు సూచనన్నది వేదాంతులు చెప్పే నిర్వేదం. కానీ వెంకయ్య నాయుడి విషయంలో మాత్రం ఈ షష్టిపూర్తి ఒక చిన్న మైలురాయి. సాధించిన విజయ పరంపరలను నెమరు వేసుకోవడానికి దొరికిన చిన్న విరామం. చిరు మజిలీ. కొత్త మెట్లు ఎక్కడానికి ఒక నిముషం నిలిచి అలుపు తీర్చుకొనే ప్రయత్నం. అందుకే షష్టిపూర్తితో తన జీవితం పండిందన్న సంతోషంతో ఆర్భాటం చేయకుండా, ఆత్మ విమర్శ కోసమా అన్నట్లు పది మంది స్నేహితులు, హితులతో ఆత్మీయ సమాగమనం జరుపుకొంటున్నాడు. సభలు సమావేశాలు కాకుండా ముచ్చట్లు మురిపాలతో ఆ రోజంతా గడపబోతున్నాడు.

రాజకీయాలను జీవనవిధానంగా మలుచుకోవాలనుకొనే వారికి వెంకయ్య నాయుడు జీవితం ఒక కరదీపిక, ఒక ఉదాహరణ, ఒక పాఠం. నూనూగు మీసాల నూతన యవ్వనంలో జై ఆంధ్రా ఉద్యమంతో రాజకీయ ఆరంగేట్రం చేశాడు వెంకయ్యనాయుడు. ఆనాటికి ఆయనొక తాడు బొంగరం లేని అనామక జీవి. క్రింద నుంచి నెట్టేవారు లేరు. పైనుంచి లాగేవారు లేరు. బోల్తా పడితే పైకి లేపేవాడు అసలే లేడు. ఆయన జనసంఘ్ పార్టీకి సమాజంలోని ఒక వర్గంలో ఆదరణ లేదు. పైగా ఏహ్యభావం. ఆ పార్టీ వారంటే ఒక రకం ఎగతాళి. టౌన్ దాటి పల్లెలకు వెళ్తే దాని ఉనికి లేదు. సమీప భవిష్యత్తులో అధికారానికి వస్తుందన్న ఆశ ఎంత మాత్రం లేదు. పదవులు దక్కుతాయన్న భరోసా అంతకంటే లేదు. ఆనాటికి జిల్లా రాజకీయాలను తన కంటిచూపుతో శాసిస్తున్న ఆనం వెంకటరెడ్డి గారు నాయుడును పిలిపించి ఆ పార్టీలో ఎందుకు మ్రగ్గిపోతావురా, కాంగ్రెస్‌లో చేరు భవిష్యత్తు వుంటుందని సలహా కూడా ఇచ్చాడు. అయినా ఏదో తెలియని మొండి పట్టుదల. మనసు మారలేదు.

వెంకయ్య నాయుడుకు వున్న ఏకైక ఆస్తి నోరు. వేదికెక్కి మైకు పట్టుకుంటే మాటలు ధారాపాతంగా, గంగా ప్రవాహంలా దొర్లి వచ్చేస్తాయి. తన ఉపన్యాసాలతోనే ఆంధ్ర ప్రజల గుర్తింపు పొందాడాయన. నిజం చెప్పాలంటే ఆయన ఏమి మాట్లాడుతున్నాడో మొదట మొదట వినేవారికి అర్థమయ్యేది కాదు. తెలుసుకోవడానికి అందులో పెద్దగా పస వుండేది కాదు. విలేకరిగా ఆయన సభలకు వెళ్లినవారు, ఉపన్యాసం అయిన తర్వాత ఆయన ఏమి చెప్పాడు, మనం ఏమి వ్రాస్తాము అని వెతికి చూసుకొంటే ఏమీ కనిపించేది కాదు. కానీ ఉపన్యాసం నడిచినంత సేపు జలపాతం హోరువలె చెవులు దిమ్మెరపోయేవి. మనకు తెలియని సంగతులెన్నో ఆయన చెప్పేస్తున్నాడన్న భ్రమ కలిగేది. ఆయన వాడే ప్రాసలకు, ఉపమానాలకు చప్పట్లు మారుమ్రోగేవి. జనాన్ని మంత్రముగ్దులను చేసేవి. ఒక్క మాటతో చెప్పాలంటే వెంకయ్యనాయుడు గొప్ప మాటల మాంత్రికుడు. తనకేమీ తెలియని విషయం మీద, జనానికి ఏదో చెప్పేసిన మాయ సృష్టించడంలో ఘనాపాటి.

ఆ విద్యే ఆయన్ను మెట్టు మెట్టుగా పైకి ఎదిగించింది. అంచలంచెలుగా రాజకీయ ఔన్నత్యమనే మోక్షాన్ని ప్రసాదించింది. ఎమర్జెన్సీ జైలు జీవితం జాతీయ నాయకుల సహచర్య భాగ్యం కల్గించింది. అద్వానీ, వాజ్‌పాయి కళ్లకు మెరికవంటి పిల్లవాడిగా కన్పించాడు. 1978లో ఉదయగిరి టిక్కెట్ వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ లేదు. ఉదయగిరిలో బిజెపికి కాలు పెట్టే చోటు లేదు. నెల్లూరు నుంచే వందలాది మంది జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు వెళ్లి సైకిళ్ల మీద వూరూరు తిరిగి, తినీ తినకా రోజుల తరబడి ప్రచారం చేసి, గెలిపిం

కొరవ 14వ పేజీలో




Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.